ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం 19 సెప్టెంబరు 2025



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

## అడవుల రక్షణ
# అందరి బాధ్యత


- ఎవరు అడ్డుపడినా అభివృద్ధి పనులను ఆపేది లేదు
- అడ్డంకులు ఎదురైతే ఒప్పించి మరీ కొనసాగిస్తా
- చిత్తశుద్ధితో పని చేస్తే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు
- నిజాయితీగా సేవ చేసే వారి వెనుక దాతలు ఉంటారు
- సత్తుపల్లి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అటవీశాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సత్తుపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అడవుల పెంపకం, రక్షణ అందరి బాధ్యతని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం సత్తుపల్లిలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, సీసీఎఫ్ భీమా నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ మొక్కల పెంపకం అటవీశాఖ బాధ్యత మాత్రమే కాదని, అందరిదన్నారు. నీలాద్రి అర్బన్‌పార్కు, పులిగుండాల, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల కోసం నివేదిక సిద్ధం చేయాలని, త్వరలో ముఖ్యమంత్రితో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పులిగుండాల, అర్బన్‌పార్కులు చిన్నారులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని సూచించారు. మొక్కల పెంపకం ప్రణాళికాబద్ధంగా సాగాలన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధితో అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరూ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని, సేవ చేయాలనుకునే వ్యక్తి ఉంటే డబ్బు ఇచ్చే దాతలు చాలా మంది ఉంటారన్నారు. కానీ దాతలిచ్చే డబ్బును సద్వినియోగం చేసే వ్యక్తులు లేరన్నారు. సంకల్పం మంచిదైతే ఏ అభివృద్ధి కార్యక్రమం కూడా ఆగదన్నారు. చిత్తశుద్ధితో పనులు చేసిన వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నానన్నారు. జలగం వెంగళరావును చూస్తూ పెరిగిన తాను సత్తుపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన సమయంలో ఆయన సీఎంగా (మిగతా 6వ పేజీలో)

### పత్తి రైతుకు వరం
## కపాస్ కిసాన్ యాప్

- సీసీఐ క్రయవిక్రయాల్లో నూతన సాంకేతికత
- యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుంటేనే కొనుగోలు 6
- 30 వరకు రైతు పేరు నమోదుకు అవకాశం
- క్వింటాకు రూ. 8,110 మద్దతు ధర

ఉమ్మడి జిల్లా భూములు.. బహుళ పంటల సాగుకు అనుకూలం. అయినా రైతులు మాత్రం మిర్చి, పత్తి తదితర వాణిజ్య పంటలతో పాటు వరి, మొక్కజొన్న లాంటి సంప్రదాయ పంటలకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో చాలామంది రైతులు పండ్లు, పూల తోటలపై ఆసక్తిచూపినా ఇటీవల మాత్రం అంతగా ఉత్సాహం చూపడం లేదు. దాంతో ఏటికేడు పూలు, కూరగాయలు, పండ్ల తోటల సాగులో ఉమ్మడి జిల్లా రైతులు వెనుబడుతున్నారు. దాంతో పూలు, పండ్లు, కూరగాయలను ఏపీలోని పలు జిల్లాలతో పాటు కర్ణాటక తదితర రాష్ట్రాలనుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ఉద్యాన శాఖ గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాలతో మామిడి, జీడిమామిడి, జామ, బొప్పాయి లాంటి పండ్ల తోటలు కొన్ని మండలాల్లో ఇప్పటికీ ఆశాజనకంగానే ఉన్నాయి.

## ప్రోత్సాహమున్నా...
# సాగు ఏదన్నా?

- జిల్లాలో తగ్గిన పండ్లు, పూలు, కూరగాయల తోటలు
- గతం కంటే సన్నగిల్లిన సాగు
- రాయితీలిస్తున్నా వెనుకాడుతున్న రైతులు
- పెట్టుబడులు భారం.. ఆదాయం దూరం కావడమే కారణం

ఖమ్మం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పోడు భూములకోసం ఉమ్మడిజిల్లాలో సుమారు 70వేల ఎకరాల్లో పట్టాలు ఇచ్చారు. వాటిలో కూడా రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న లాంటి పంటలు వేస్తున్నారు. ఈ పోడుభూముల్లో పండ్లతోటల సాగు చేయించగలిగితే ఉమ్మడిజిల్లాలో పండ్లు, పూలు, కూరగాయల ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో 50వేల ఎకరాల్లో పండ్ల తోటలున్నాయి. మరో 50వేల ఎకరాల్లో విస్తరించే అవకాశాలున్నా రైతులు వెనుకాడుతున్నారు. పండ్లు, పూలు, కూరగాయల పంటల సాగుకు పెట్టుబడులు అధికం కావడం, ఆదాయం వెంటనే అవకాశం లేకపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం లాంటి కారణాలతో ఉత్సాహం చూపడంలేదు. కొందరు మామిడితోటలు నరికి జామాయిల్, సుబాబుల్ తోటలను వేస్తున్నారు.

### ప్రభుత్వాల నుంచి అనేక ప్రోత్సాహకాలు

పండ్లు, పూలు, కూరగాయల తోటలు, పంటలను సాగు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. 40శాతం రైతులకు రాయితీ ఇస్తున్నాయి. ప్రాజెక్టు ఆధారిత పథకం, సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు కలిపిస్తున్నాయి.

- సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద మామిడి, అరటి, అవకాడో, బత్తాయి, జామ తదితర పంటలను ఖమ్మం జిల్లాలో 9,902 ఎకరాల్లో సాగుచేయాలని ఉద్యాన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి యూనిట్‌కు రూ.50వేల నుంచి రూ.80వేల వరకు ఖర్చవుతుండగా రూ.20వేలనుంచి రూ.32వేల వరకు ప్రభుత్వం రాయితీగా అందిస్తుంది. ప్రతి రైతు గరిష్ఠంగా 5ఎకరాల వరకు సబ్సిడీ పొందేందుకు సౌలభ్యం ఉంది. ఇది రెండు విడతలుగా చెల్లింపు ఉంటుంది.
- కూరగాయలు సాగు కూడా అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. జిల్లాకు ఉల్లి, టమాటతో పాటు ఆకుకూరలు, దుంపలు, ఇతర కూరగాయలు ఎక్కుశాతం ఏపీనుంచి దిగుమతువుతున్నాయి. మునిసిపల్ పట్టణాలు సమీప గ్రామాల రైతుల కూడా కూరగాయల సాగుకు ఉత్సాహం చూపడంలేదు. ఈపరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో 10వేల ఎకరాల్లో కూరగాయల పంటల సాగు పెంచేందుకు ఉద్యానశాఖ నిర్ణయించింది. దీనికి ఎకరానికి రూ.24వేలు ఖర్చుకు రూ.8వేల వరకు రాయితీ లభిస్తుంది. ప్రతీ రైతు ఐదెకరాల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. తద్వారా కూరగాయల విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చులు రైతులకు రాబోతున్నాయి.
- పూలసాగులో ఖమ్మం జిల్లా పూర్తిగా వెనుకబడి ఉంది. జిల్లాలో ప్రాథమికంగా 8,549 ఎకరాల్లో పలురకాల పూలతోటలు వేయాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఎకరానికి రూ.20వేలు పెట్టుబడికాగా రూ.8వేల వరకు.. సుమారు 5ఎకరాల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. అయితే జిల్లాలో ఇటీవల కాలంలో హైబ్రిడ్ బంతి సాగు ఆశాజనకంగా ఉంది. మల్లె, కనకాంబరం, జాజి, చామంతి వంటి పూలసాగుకు (మిగతా 8వ పేజీలో)

# రామదాసు కాలం నుంచి...

- 52 ఏళ్లుగా వీరలక్ష్మి ఉత్సవాలకు వేదికగా భద్రాద్రి
- రామాయణ పారాయణం ఇక్కడి ప్రత్యేకత
- 23 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రోత్సవాలు

భద్రాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 23నుంచి అక్టోబరు 2వరకు జరగనున్నాయి. అక్టోబరు 2న నిజరూప లక్ష్మి అలంకారం, శ్రీరామాయణ పారాయణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సమయంలో విజయదశమి నాడు శ్రీరామ మహాపట్టాభిషేకం, విజయోత్సవం, శమీపూజ, ఆయుధపూజ, శ్రీరామ లీలా మహోత్సవం నిర్వహించనున్నారు.

### వీరలక్ష్మి ఉత్సవాలకు వేదికగా భద్రాద్రి

విజయవాడలోని కనకదుర్గ దేవస్థానంలో నిర్వహిస్తున్న మాదిరిగానే భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏటా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న ఉత్సవాల మాదిరిగానే భద్రాచలంలో నిర్వహించే ఈ శరన్న నవరాత్రి ఉత్సవాలకు ఎంతో ప్రత్యేక ఉంది. ఎందుకంటే భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలు పాంచరాత్రాగమశాస్త్రానికి అనుగుణంగా వీరలక్ష్మి ఉత్సవాలుగా భక్తరామదాసు కాలం నాటినుంచి కొనసాగుతున్నాయి. అయితే కాలక్రమేణా భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఈ ఉత్సవాల సమయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేయాలనే సంకల్పం 1973-74 సంవత్సరంలో చోటు చేసుకొంది. దీంతో నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏటా ఆశ్వీయుజమాసంలో శుక్లపక్ష పాడ్యమి నుంచి పదిరోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈవిధంగా గత 52ఏళ్లుగా భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాలు దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోంది.


లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయం



### అష్టలక్ష్మిలుగా అమ్మవారు..

ప్రతి మనిషికి కోరికలు ఉంటాయి. ఆ కోరికలు మొత్తం ఎనిమిది రకాలు. ఈ ఎనిమిది రకాల కోరికలను మనిషి నెరవేర్చుకోవడానికి ఎనిమిది అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూ ఉంటారు. వాటినే అష్టలక్ష్మీ అలంకారాలని, అష్ట కామనలని పిలుస్తారు. ఈ ఎనిమిది రకాల అలంకారాల్లో అమ్మవారిని కొలిస్తే అష్టైశ్వర్యాలు, భోగ బాగ్యాలు, విద్య, ధైర్యం, సంతానం, విజయం తదితర మనోభీష్టాలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో అక్టోబరు 2నుంచి ప్రసిద్ధ రామక్షేత్రమైన భద్రాచలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సమయంలో ఆదిలక్ష్మి, సంతానలక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధ్యాన లక్ష్మి, (మిగతా 6వ పేజీలో)


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

## ఇందిరమ్మ ఇళ్లపై
# వారిది కడుపు మంట..

- పేదలకు గూడు కట్టిస్తే సహించలేకపోతున్నారు
- పదేళ్లలో బీఆర్ఎస్ ప్రజల కలలను ఛిద్రం చేసింది
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు కడుపు మండుతోంది. పాముకు కోరల్లో విషం ఉంటే వారికి ఒళ్లంతా విషమే ఉంది. పేదవాడికి గూడు కట్టిస్తుంటే సహించలేకపోతున్నారు' అంటూ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ నాయకులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో కాంగ్రెస్‌పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఏడాదికి లక్ష ఇళ్లు కట్టి ఉంటే పది లక్షల కుటుంబాలకు గృహాలు అంది ఉండేవన్నారు. కానీ కమీషన్ కోసం మునిగిపోయే (మిగతా 6వ పేజీలో)

### ర్యాక్ పాయింట్ నుంచి
## యూరియా
# పంపిణీ


యూరియా పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

చింతకాని, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు 2,343.60 మెట్రిక్ టన్నుల యూరియా గురువారం చింతకాని మండలం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు చేరిందని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు 1,073.60, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 470, మహబూబాబాద్ జిల్లాకు 600, సీఆర్‌పీ ఖమ్మానికి 200 మెట్రిక్ టన్నులు యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు. దిగుమతి చేసుకున్న యూరియాను జిల్లాలోని సొసైటీలకు పంపిణీ చేస్తున్నామన్నారు.

## బీసీ రిజర్వేషన్లు తేలాకే 'స్థానిక' ఎన్నికలకు..

- ఫ్యూడల్ మనస్తత్వంతో వ్యవహరిస్తున్న బీఆర్ఎస్
- యూరియా కొరత సృష్టించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర 6
- పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- వైరాలో విలేకరుల సమావేశం


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

## గిరిజన నాయకులతో ఈవో సమావేశం

- 'శబరి' యాత్ర నిర్వహణపై సమీక్ష
- అన్నదాన పథకానికి ఏపీ భక్తుల రూ.1.50 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

భద్రాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెల 7న నిర్వహించే శబరి స్మృతి యాత్రపై ఈవో దామోదర్‌రావు గురువారం గిరిజన నాయకులతో సమావేశమయ్యారు. యాత్ర నిర్వహణలో భాగంగా గిరిజన నాయకుల తరఫున తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన ఆయన వారికి తగిన సూచనలను చేశారు. అదేవిధంగా దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు గ్రామానికి చెందిన గారపాటి రామ తులసమ్మ రూ.లక్ష, బొప్పాడి కాశీబాబు, శాంతారాణి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. అలాగే శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

## మున్నేటి ఇసుకాసురులపై చర్యలు

- డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై కేసులు
- తహసీల్దార్, ఎస్‌ఐపై బదిలీ వేటు
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చింతకాని, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలోని చిన్నమండవ మున్నేటిలో ఇందిరమ్మ ఇళ్లకు కూపన్ల ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్న ట్రాక్టర్ల వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇసుకాసురులపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ జరుగుతున్న దందాపై ఈ నెల 12వ తేదీన 'ట్రాక్టరుకు రూ 2 వేలు' శీర్షికను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం జిల్లాలో సంచలన రేపింది. స్పందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన క్రమంలో కలెక్టర్, సీపీలతో సమావేశమై బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మండల అధికారులు బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యంపై ఆయన హెచ్చరికలు చేశారు. ఆ మేరకు ఉన్నతాధికారులు గురువారం దిద్దుబాటు చర్యలు చేపట్టారు. డబ్బు వసూలు చేసిన వారిపై కేసులు పెట్టగా.. చింతకాని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎస్‌ఐ నాగుల్‌మీరాలను బదిలీ చేస్తూ కలెక్టర్, పోలీస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానాల్లో సత్తుపల్లి టౌన్ ఎస్‌ఐగా పని చేస్తున్న ఎస్.వీరేందర్, బోనకల్ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జే బాబ్జీప్రసాద్‌కు (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

### బాధితుల ఫిర్యాదుతో..

మున్నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్లకు కూపన్ల ద్వారా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల వారిన నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నలుగురు వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. బోనకల్లు మండలం రామాపురానికి చెందిన మల్లెల వీరభద్రానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణ పనులకు సంబంధించిన ఇసుక కోసం ఈ నెల 11వ తేదీన చింతకాని మండలం చిన్నమండవ మున్నేటి వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ తొమ్మిది ట్రాక్టర్లున్నాయి. ఇసుక రేవు వద్ద ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ షఫీ అనే వ్యక్తి మున్నేరులో తనకు పట్టా భూమి ఉందని చుట్టూ కంచెతో పాటు గేటు ఏర్పాటు చేశాడు. మహ్మద్ అతిక్యూ రెహ్మాన్, పర్చగాని బుల్లి వెంకయ్య, కిన్నెర సుధాకర్ అనే వ్యక్తులను అక్కడ కాపలాగా ఉంచి ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.వేయి చొప్పున బలవంతంగా వసూలు చేశారు. ప్రశ్నించిన వారిని దుర్భాషలాడుతూ, చంపుతామని బెదించారు. ఈ మేరకు బాధితుల నుంచి తమకు అందిన ఫిర్యాదుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.


మెప్మా ఆర్పీలు (ఫైల్)

## మెప్మా ఆర్పీలకు శుభవార్త

- ఐదు నెలల పెండింగ్ వేతనాలు మంజూరు
- బ్యాంకు ఖాతాలకు రూ.77లక్షల మళ్లింపు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలనలో రాత్రింబవళ్లు క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లకు శుభవార్త అందింది. మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల పెండింగ్ వేతనాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఆర్థిక నిధులను మంజూరు చేశారు. ఈ క్రమంలో మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు ఐదు నెలల పెండింగ్ వేతనాలకు సంబంధించి రూ.77లక్షలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తూ గురువారం ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్ నళిని ప్రసాద్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం లోపు ఖమ్మంలో 167మంది, మధిరలో 30, సత్తుపల్లి 22, వైరా 24 మొత్తం 250 మంది ఖాతాలకు చేరనున్నాయి.పెండింగ్ వేతనాల మంజూరు పట్ల ఐఎన్‌టీయూసీ ఆర్పీల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షురాలు ఎస్‌కే సబీహా అంజుం, కార్యదర్శి గంధసిరి పద్మ, కోశాధికారి బత్తుల మొగిలమ్మ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లు తేలాకే
# 'స్థానిక' ఎన్నికలకు..

» ఫ్యూడల్ మనస్తత్వంతో వ్యవహరిస్తున్న బీఆర్ఎస్

» యూరియా కొరత సృష్టించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర » మంత్రి సీతక్క ధ్వజం

వైరా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులపై స్పష్టత వచ్చాకనే స్థానిక సంస్థల ఎన్నికలపై ముందుకు వెళ్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఫ్యూడల్ మనస్తత్వంతో పనిచేస్తుందని ఆమె ధ్వజమెత్తారు. గురువారం సత్తుపల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న సీతక్క తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలోని వైరాలోని కాంగ్రెస్ నాయకుడు చెరుకూరి కిరణ్ ఇంట్లో నిర్వహించిన తేనేటి విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీతక్క మాట్లాడారు. మహాలక్ష్మీ పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సైతం బీఆర్ఎస్ భరించలేకపోతుందని ఆక్షేపించారు. బస్సుల్లో సీట్ల కోసం మహిళలు ఘర్షణ పడతారా...? వారేమైనా శత్రువులా అని ప్రశ్నించారు. ఓర్వలేని బీఆర్ఎస్ నేతలే మహిళా కార్యకర్తలను బస్సుల్లో ప్రయాణింపజేసి ఘర్షణ పేరిట దుష్ప్రచారం చేస్తుందని ఇది ఆపార్టీ ఫ్యూడల్ మనస్తత్వమని ఆక్షేపించారు. ఇదే ఫ్యూడల్ మనస్తత్వం పక్క రాష్ట్రంలో కూడా ఇటీవలనే కన్పిస్తుందని పరోక్షంగా వైసీపీని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై సోషల్‌మీడియా, యూట్యూబ్‌లను వాడుకొని బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకైన ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వని బీఆర్ఎస్ ఇప్పుడు యూరియా కొరత పేరిట డ్రామాలాడుతుందని విమర్శించారు. రాష్ట్రానికి యూరి యా కేటాయింపులు కేంద్రం నుంచి రావల్సిందనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ కుమ్మక్కై యూరియా కొరత సృష్టిస్తూ రాష్ట్రంలోని రైతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తీసుకురావడానికి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కేంద్రానికి రెండు బిల్లులు పంపించామని ఇంతవరకు ఉలుకుపలుకు లేదని, కేంద్రంపై వత్తిడి పెంచేందుకే కొంత సమయాన్ని తీసుకున్నామని, ఆబిల్లులపై స్పష్టత వచ్చిన తర్వాత ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు చెరుకూరి కిరణ్, సూర్యదేవర శ్రీధర్, మరికంటి శివ, బోళ్ల గంగారావు, కర్నాటి హన్మంతరావు, జవ్వాజి నాగరాజు, తేళ్లూరి వీరయ్య, రాచకొండ సాయి, పైడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతుకు వరం
# 'కపాస్ కిసాన్ యాప్'




» సీసీఐ క్రయవిక్రయాల్లో నూతన సాంకేతికత

» యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుంటేనే కొనుగోలు

» ఈనెల 30 వరకు రైతు పేరు నమోదుకు అవకాశం

» క్వింటాకు రూ. 8,110 మద్దతు ధర

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకు వరంలా 'కపాస్ కిసాన్ యాప్' మారనుంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ఈ ఏడాది పత్తి కొనుగోళ్ళలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఉండేందుకు కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించింది. పత్తి క్రయవిక్రయాలలో నూతన సాంకేతికను ఉపయోగించుకొని కొనుగోళ్ళ, ధరలు, అకౌంట్‌లోకి పంటతాలూకా నగదు జమ తదితర సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా యాప్‌ను ప్రవేశ పెట్టారు. ఈ యాప్‌ను సీసీఐ గతేడాది నుంచే అమలు చేసినా దీనిపై అవగాహనా లోపంతో ఎక్కువ మంది రైతులు వినియోగించలేదు. దీంతో ఈ ఏడాది ఈ యాప్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేసి తిరిగి అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ యాప్‌లో రైతులు సెప్టెంబరు 1 నుంచి 30 వరకు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు అకాశం ఇచ్చారు.

**ఉమ్మడి జిల్లాలో ఈఏడాది పత్తి సాగు వివరాలు**

- ఖమ్మం జిల్లాలో పత్తి సాగు: 2 లక్షల 25 వేల 613 ఎకరాలు
- దిగుబడి అంచనా: సుమారు 27 లక్షల క్వింటాళ్లు
- సీసీఐ కొనుగోలు సెంటర్లు: 9 జిన్నింగ్ మిల్లుల వద్ద
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పత్తి సాగు: 2 లక్షల 21 వేల 345 ఎకరాలు
- దిగుబడి అంచనా: సుమారు 22 లక్షల క్వింటాళ్లు
- సీసీఐ కొనుగోలు సెంటర్లు: 5 జిన్నింగ్ మిల్లుల వద్ద

**- అక్రమాలకు తావివ్వకుండా చర్యలు**

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 4.46 లక్షల ఎకారాలలో పత్తి పంట సాగు చేశారు. అందులో ఎక్కువగా ఖమ్మం జిల్లాలో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.21 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేశారు. అంతే కాకుండా సీసీఐ క్రయ విక్రయాలలో ఏటా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతుల పేరున దళారులు, వ్యాపారులు సీసీఐకి విక్రయించి లబ్ది పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలో కొంతమంది మార్కెట్ కమిటీల అధికారులను సైతం ప్రభుత్వం సస్పెండ్ చేసింది. దీంతో ఈ ఏడాది అక్రమాలకు తావివ్వకుండా కొనుగోళ్ళు సక్రమంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీసీఐ కూడా ఈ ఏడాది నూతన సాంకేతికను ఉపయోగించి కపాస్ కిసాన్ యాప్‌ను పకడ్బందీగా అమలు చేయాలని భావిస్తుంది.

**కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు ఇలా**

ప్లేస్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత సెల్ నెంబరు నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. తరువాత రైతు పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్ నెంబర్, బ్యాంక్ ఖాతా నంబరు, పట్టాదార్ పాస్ పుస్తకం నంబర్, ఎన్ని ఎకరాల్లో పత్తిని సాగు చేశారో ఆ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందులో పత్తిని ఎప్పుడు విక్రయించుకుంటారో రైతులే స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం ఉంది. పత్తి విక్రయాలు, పంట తాలూకా బ్యాంక్‌లో నగదు జమ తదితర సమాచారం తెలుసుకోవచ్చు.

**పత్తి రైతులు పేరు నమోదు చేసుకోవాలి**

**● ఎంఏ. అలీం, జిల్లా మార్కెటింగ్ అధికారి**



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఈఏడాది పత్తి క్రయ విక్రయాలలో నూత న సాంకేతికతను ఉపయోగించి కపాస్ కిసాన్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ లో ప్రతి ఒక పత్తి రైతు తమ పేరును కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తమ పంటను అమ్మే తేదీలను సైతం స్లాట్ బుక్ చేసుకుంటే సీసీఐ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు ఉండవు. యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

## వీధి వ్యాపారుల చేతిలోనే
# ప్రజా ఆరోగ్యం

» నాణ్యమైన, రుచి, శుచికరమైన ఆహార ఉత్పత్తులపై వీధి వ్యాపారులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న వ్యాపారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ప్రజా ఆరోగ్యం వీధి వ్యాపారుల చేతిలోనే ఉందని సరైన పరిశుభ్రతతో నాణ్యమైన ఆహారం శుచి, రుచి కరంగా తయారు చేసి ఇవ్వాలని, ఆహారం కోసం వచ్చే ప్రజలతో వీధి వ్యాపారులు సంతోషంగా స్వాగతించాలని, ప్రజలతో మమేకమై తమ వ్యాపారాన్ని పెంచుకొవాలని మెప్మా జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ సావల సుజాత, ఆహారపు నాణ్యతా ప్రమాణాల జా తీయ నిపుణులు పేర్కొన్నారు. వీధి వ్యాపారుల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి స్వనిధిలో లోక్ కళ్యాణ్ మేళ కార్యక్రమంలో బాగంగా గురువారం ఖమ్మం మెప్మా ఆధ్వర్యంలో 100 మంది వీధి వ్యాపారులకు ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యమైన కల్తీ లేని ఆహారం తయారిపై శిక్షణ ఇచ్చారు. జాతీయ ఆహారపు నాణ్యత నిపుణులు ఆర్ ప్రసాద్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీధి వ్యాపారులకు శిక్షణ ఇచ్చారు. వీధి వ్యాపారులకు ఆహారపు, వ్యాపార మేళకవలు నేర్పించారు. పరిశుభ్రమైన ఆహారం తయారీ, వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా మెప్మా మిషన్ కో ఆర్డినేటర్ సావల సుజాత మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను వీధి వ్యాపారులు తమ ఆహారపు ఉత్పత్తల తయారీలో అమలు చేయాలని కోరారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవోలు ఎస్‌కే సల్మా, చిలకా ద్రౌపది, గోప్పొచి ఉపేంద్ర, బొల్లికొండ రోజా పాల్గొన్నారు.

**కల్తీ పదార్థాలపై అవగాహన కల్పించారు**

**నిమ్మల ధనలక్ష్మి, మహిళా శక్తి క్యాంటీన్, కేఎంసీ**



వీధి వ్యాపారులకు శిక్షణా కార్యక్రమంలో ఆహారం తయారీలో వినియోగించే పదార్థాలు కల్తీపై మంచిగా వివరించారు. రుచికరమై, శుచికరమైన ఆహారం మేళకవలు నేర్పారు. ఆహా రం కోసం వచ్చే వారితో మాట్లాడే విషయాలను వివరించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆహారపు తయారీలో అమలు చేస్తాం..

**నాణ్యమైన ఆహారం తయారీ నేర్చుకున్నా**

**షేక్ నజీమా, వీధి వ్యాపారి, లకారం ట్యాంక్ బండ్**



నాణ్యమైన ఆహారం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన ఆయిల్ నుంచి పదార్థాలపై మంచి అవగాహన కల్పించారు. ఆహారం తయారీలో వ్యక్తిగత పరిశుభ్రత వంటశాలల నిర్వాహణపై మంచి అవగాహన కల్పించారు. తయారు చేసిన ఆహారం నిల్ల ఉంచే విధానం, కీటకాలు, పురుగుల నుంచి సంరక్షణపై సమగ్రంగా తెలిపారు. శిక్షణా కార్యక్రమం ఎంతో ఉపయోగపడింది.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి


తుమ్మలను కలసిన ములకలపల్లి నాయకులు

దమ్మపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మంత్రి తుమ్మలను పలువురు కలిసి వినతి పత్రం అందించారు. శుక్రవారం గండుగులపల్లి ఆయన నివాసంలో కలిసి సమస్యలపై వినతులు అందించారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం పరిధిలోని కందుకూరు, భరణిపాడు, మర్లపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు 3వేలకు పైగా ఎకరాలలో వరుణ్ ఆగ్రోటెక్ కంపెనీకి చెందిన 2782 రకానికి చెందిన వరి విత్తనాన్ని సాగు చేశారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయామని తమను ఆదుకోవాలంటూ ఆమండలానికి చెందిన రైతులు తుమ్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించి పూర్తి విచారణ చేసి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు పంట కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించలేదంటూ అశ్వారావుపేట మండల పరిధిలోని తిరుమల కుంట తదితర గ్రామాలకు చెందిన పలువురు గిరిజన రైతులు తుమ్మలను కలిసి వినతి అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. పాల్వంచకు చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగశీతారాములు, భద్రాచలానికి చెందిన రసూల్ తదితరులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. తుమ్మల తనయుడు యుగంధర్ తుమ్మలను కలిసేందుకు వచ్చిన వారిని అందరిని కలిసి ఆప్యాయంగా పలుకరించారు. దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, కేవీ సత్యనారాయణ, మన్నెం అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, కొత్తూరి ప్రభాకరరావు, పసుమర్తి చంద్రరావు, అడపా నాగేశ్వరరావు, కరుటూరి కృష్ణ, తాండ్ర ప్రభాకరరావు, రవితేజ బత్తుల అంజి అమరనాద్, కిరణ్, నాగయ్య, పువ్వాల మంగపతి తదితరులు ఉన్నారు.


## అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

టేకులపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంతో పాటు అనారోగ్యానికి గురైన ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తొమ్మిదోమైలుతండాలో జరిగింది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన మాలోతు భీక్యా(75) భార్య ఐదేళ్ల క్రితం మరణించింది. నాటినుంచి ఆయన మానసికంగా బాధపడుతున్నాడు. దీంతో పాటు అనారోగ్యానికి గురయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగాడు. వాంతులు చేసుకొంటుండగా కుటుంబ సభ్యులు గమనించారు. వెంటనే కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసినట్లు టేకులపల్లి ఎస్ఐ రాజేందర్ తెలిపారు

## బ్యాంకు లావాదేవీల్లో మోసం

**ఖాతాదారుడి ఆరోపణ**

పాల్వంచటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలోని ఎస్‌బీఐలో బంగారు ఆభరణాలపై రుణం తీసుకోగా ఆ లావాదేవీల్లో అప్రైజర్ బ్యాంకు అధికారుల ప్రమేయంతో తనకు మోసం జరిగిందని పాల్వంచకు చెందిన తాతా భాస్కరరావు ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. 7.7.25న ఆభరణాలు తనఖా పెట్టి రూ.2.90లక్షలు తీసుకున్నానన్నారు. రుణం చెల్లించేందుకు 13.08.25న బ్యాంకు అప్రైజర్‌గా పని చేస్తున్న వ్యక్తికి ఆ డబ్బులు ఇచ్చి గోల్డ్‌లోన్ ఖాతాలో జమచేయమని ఇచ్చానన్నారు. కానీ జమచేసి నా ఆభరణాలు నాకు ఇవ్వకుండా మోసం చేశాడని ఆయన ఆరోపించారు. పోలీసులకు, బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న బాధితుడు భాస్కరరావు

# రామదాసు కాలం నుంచి..

(5వ పేజీ తరువాయి)

విజయలక్ష్మి, ఐశ్వర్య లక్ష్మి, వీరలక్ష్మి, మహాలక్ష్మి, నిజరూపలక్ష్మి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ సమయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు సాక్షాత్తు స్వామి వారే అమ్మవారి చెంతకు వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుంది. ఇందులో భాగంగానే దర్బారు సేవను ఈ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి ఆలయానికి ఎదురుగా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి నిర్వహిస్తుండటం విశేషం. ఇది నాటి రామదాసు కాలం నుంచి వస్తున్న అరుదైన సంప్రదాయం.

**రామాయణం పారాయణ ఉత్సవాలు ఇక్కడి ప్రత్యేకత**

ప్రతీరోజు ఆలయంలో స్వామివారికి రామాయణ పారాయణం నిర్వహించడం ఇక్కడ పరిపాటి. అయితే శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో తొమ్మిది రోజుల పాటు బాల కాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధ కాండ, సుందరాకాండ, యుద్ధకాండలను భక్తి ప్రపత్తులతో తప్పనిసరిగా పఠించి ఈ పారాయణ పరిపూర్తిని పురస్కరించుకొని దశమి నాడు స్వామివారికి సర్వ విధ రాజలాంఛనాలతో మహాపట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహిస్తారు. శ్రీరామాయణ పారాయణాన్ని దేవస్థానం ఆస్థాన రామాయణ పారాయణదారులు ప్రతి ఏటా నిర్వహిస్తారు.


అమ్మవారి ఆలయం ఎదుట వేదిక (ఫైల్)

## ఇందిరమ్మ ఇళ్లపై
# వారిది కడుపు మంట..

(5వ పేజీ తరువాయి)

కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టారని, పేదలకు మాత్రం ఇళ్లు ఇవ్వలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజల కలలను ఛిద్రం చేశారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు పక్కన పెట్టినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు ఓట్లతో మరోసారి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే అమలవుతున్నాయన్నారు. ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 80కుటుంబాలవారు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, కాంగ్రెస్ నాయకులు రాంమూర్తి నాయక్, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, బండి జగదీష్, తోట వీరభద్రం, వెంపట రవి, వీరారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌భద్రాద్రి సేవలు అభినందనీయం: సబ్‌కలెక్టర్


మొక్క నాటుతున్న సబ్‌కలెక్టర్

భద్రాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరంతరం మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని కాపాడుతున్న గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయమని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అన్నారు. భద్రాచలంలో గురువారం డిగ్రీ కళాశాల సమీపంలోని కరకట్టపై గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిరంతరం మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి సంస్థ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు చిట్టె లలిత, కోఆర్డినేటరు పామరాజు తిరుమలరావు, పల్లంటి దేశప్ప, కామిశెట్టి కృష్ణార్జునరావు, గంగాధర వీరయ్య, బిర్రు సుధాకర్ పాల్గొన్నారు.

# అడవుల రక్షణ అందరి బాధ్యత

(5వ పేజీ తరువాయి)


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, కలెక్టర్ అనుదీప్

పూర్తి చేయలేని పనులను కూడా పూర్తి చేశానన్నారు. తాను సత్తుపల్లి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూనే ఉంటానన్నారు. ఎవరు అడ్డుపడినా అభివృద్ధి పనులను ఆపేది లేదని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకూ తనకు రాజకీయంగా జన్మనిచ్చిన సత్తుపల్లి నియోజకవర్గాన్ని మరువబోనని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటానన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎవరున్నా.. కొందరితో ఆటంకాలు వచ్చినా.. ఒప్పించి మరీ అభివృద్ధిని పూర్తి చేసి తీరుతామన్నారు. ఈ క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, బేతుపల్లి వరదనీటి కాలువ అలైన్‌మెంట్, రాబోయే రోజుల్లో రైల్వేలైన్, ఇందిరాసాగర్ తదితర ప్రజావసరాల పనులు పూర్తి చేస్తామన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో సింగరేణి ప్రభావిత ప్రాంతాల వారి ఇబ్బందులు తొలగించేందుకు, అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు మంజూరు చేసేలా సంబంధిత మంత్రి, సింగరేణి ఎండీతో చర్చిస్తామని దీనికి సంబంధించి రిపోర్టు తయారు చేయాలని కొత్తగూడెంఏరియా జీఎంకు సూచించారు. సీతారామా ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా యాతాలకుంటటన్నెల్, ఇతర పనులు పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేస్తే వచ్చేజూన్ నాటికి వేంసూరు మండలానికి గోదావరి జలాలు అందిస్తామన్నారు.

**సత్తుపల్లికి రాష్ట్రంలో గుర్తింపు**

నియోజకవర్గంగా ఏర్పాటైన అయిన నాటి నుంచి సత్తుపల్లికి ఒక సంస్కృతి, సంప్రదాయం, గౌరవం, ప్రతిష్ఠ, క్రమశిక్షణను ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఏస్థాయిలో ఎవరున్నా ఆపకుండా కొనసాగించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సత్తుపల్లికి ఒక ప్రత్యేక స్థానం ఉండటం వల్లే ఇక్కడ పని చేసే అధికారులు, పదవులు వచ్చిన తాము ఒళ్లు దగ్గరబెట్టుకొని సత్తుపల్లి గౌరవాన్ని కాపాడేటట్టు ఉండాలన్నారు. సత్తుపల్లి ప్రతిష్ఠ పెరిగేలా ఉండాలన్నారు.

**పార్కుల పర్యవేక్షణకు డ్రోన్లు కలెక్టర్ అనుదీప్**

ఖమ్మం వెలుగుమట్ల, సత్తుపల్లిలో అర్బన్‌పార్కుల సంరక్షణ కోసం డ్రోన్ కెమెరాలను మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. అర్బన్ పార్కులకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చేలా చూడాలని కోరారు. వారాంతాల్లో పిల్లలు అర్బన్ పార్కుకు వచ్చి సరదాగా గడిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బొగ్గుగనుల ద్వారా వచ్చే దుష్పరిణామాలను తగ్గించేందుకు వీలుగా అర్బన్ పార్కు అభివృద్ధి చేయాలన్నారు.

**అటవీ అధికారుల కృషి ప్రసంశనీయం: ఎమ్మెల్యే**

సత్తుపల్లిలో అర్బన్ పార్కు అభివృద్ధికి అధికారులు అందిస్తున్న కృషి అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి అన్నారు. అటవీ అభివృద్ధితో పాటు అడవిపై ఆధారపడి జీవిస్తున్న పేదలను ఇబ్బందులకు గురి చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ భీమానాయక్, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

# భూస్వామ్య పెత్తందారులు పద్ధతి మార్చుకోవాలి

» చర్ల మండల రాజకీయ నాయకులకు హెచ్చరికలు

» లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పెత్తం దారులు పద్ధతి మార్చుకోవాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ. విప్లవ పేరుతో గురువారం రాత్రి మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. ఆ లేఖలో 'భూ స్వామ్య పెత్తందారులూ ఖబడ్దార్, మీఆగడాలు కూకటివేళ్లతో పెకిలిస్తాం. పద్ధతి మార్చుకోండి' అని ప్రముఖంగా ప్రచురించారు. భూస్వామ్య పెత్తందారులు మావోయిస్టు పార్టీపై చేస్తున్న ప్రచారాన్ని మానుకోవాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కొంతమంది పెత్తందారులు పోకడలకు పాల్పడుతున్నారని పద్ధతి మార్చుకోకపోతే, ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా చర్ల మండలంలోని ప్రముఖుల పేర్లను లేఖలో ప్రస్తావించారు. పెద్ద రికంలో ఉన్న భూస్వాముల భూములు పేదలకు పంచాలని పేదలకు అప్పగించాలని, లేదంతే ఆ భూములను పార్టీ స్వాధీనంలోకి తీసుకుని పేదలకు పంచుతుందని హెచ్చరించారు. అలాగే వ్యాపారులు, భూస్వాములు పోలీసులకు పూర్తిగా ఇన్‌ఫార్మర్లుగా మారారని, పోలీసుల కోసం పని చేస్తూ పార్టీకి సహకరిస్తున్నట్టుగా మాయమాటలు చెప్పి మోసగిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. అలాగే అడవుల్లో ఖనిజ సంపదను ఎత్తుకెళ్లేందుకు తమ పార్టీపై కుట్రలు పన్నారని ఆరోపించారు. మండలంలోని గొల్లగుప్ప గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారంపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌లో అమరులైన వారి త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగాలని విప్లవ లేఖలో పేర్కొన్నారు. కాగా ఈ లేఖ చర్ల మండలంలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

## సింగరేణి ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు!

**ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు**

**సంస్థ వ్యాప్తంగా 150మందికి అవకాశం**

కొత్తగూడెం,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు పదోన్నతులు ఇచ్చేందుకు సంస్థ యాజమాన్యం అంగీకరించింది. అర్హత ఉన్న ఈపీ ఆపరేటర్లకు ఎక్స్‌కవేషన్ కేటగిరి-డీ నుంచి సీ కేటగిరీకి, సీ కేటగిరి నుంచి బీ కేటగిరీకి పదోన్నతులు ఇచ్చేందుకు అంగీకరిస్తూ సింగరేణి సీఎండీ బలరాం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఎక్స్‌కవేషన్ కేటగిరి - డీలో రెండేళ్లు పనిచేసిన వారికి 'సీ'కి, సీ కేటగిరిలో మూడేళ్లపాటు సర్వీసు పూర్తిచేసిన ఆపరేటర్లకు బీకి పదోన్నతులు ఇవ్వనున్నారు. ఖాళీలతో సంబంధం లేకుండా ఈ ప్రమోషన్లను ఒకసారి మాత్రమే కల్పించాలని నిర్ణయించారు. గతంలో ఈపీ ఆపరేటర్లు తమ సర్వీసు పూర్తిచేసిన తర్వాత ప్రాక్టికల్ పరీక్ష మరియు అసెస్‌మెంట్ నివేదికలో అర్హత సాధించిన వారికి మాత్రమే ఖాళీల ఆధారంగా పదోన్నతులు కల్పించేవారు. కాగా ఇటీవల జరిగిన 38వ సీఎండీ స్థాయి, 50వ డైరెక్టర్(పా) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఇచ్చిన ప్రతిపాదనపై స్పందించిన యాజమాన్యం ఈ అంశంపై ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేయగా.. వారిచ్చిన నివేదికను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం మార్చి 2025 లేదా సెప్టెంబరు 2025 నాటికి తమ సర్వీసు పూర్తి చేసిన ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయం వల్ల సింగరేణి మొత్తం మీద సుమారు 150 మంది ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు దక్కనున్నాయి.

# పిల్లలకు ఆహ్లాదం అందేలా చూడండి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీలాద్రి అర్బన్ పార్క్‌కు వచ్చే పిల్లలకు ఆహ్లాదాన్ని అందించేలా చూడాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి అటవీశాఖ పరిధిలోని రూ.90లక్షల పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలాద్రి అర్బన్ పార్క్ వద్ద మంత్రి తుమ్మలతో పాటు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, సీసీఎఫ్ భీమా నాయక్, కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌వో సిద్ధార్థ్‌విక్రమ్‌సింగ్‌లకు చింతూరుకు చెందిన కొమ్మునృత్యం కళాకారులు ఘనస్వాగతం పలికారు. పార్క్‌లో చైన్‌లింక్, ఎకోఫ్రెండ్లీ సఫారీ బ్యాటరీ వెహికిల్స్‌లను ప్రారంభించిన అనంతరం బ్యాటరీ వాహనాన్ని మంత్రి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల



అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

తుమ్మల నడిపి పార్క్‌లో కలియతిరిగారు. ఇక్కడి వచ్చిన పిల్లలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఇతర ప్రాంతాల నుంచి జంతువులు, పశుపక్ష్యాదులను తీసుకురావాలని, అరుదైన మొక్కలను పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేయాలని కోరారు. అనంతరం టింబర్ డిపో వద్దకు చేరుకుని అమరవీరుల స్థూపం వద్ద గుత్తికోయల చేతిలో అశువులు బాసిన శ్రీనివాస్‌ను స్మరిస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాలలో లభ్యమైన విత్తనాలు, గిరిజనులచే రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ వస్తువులను ప్రదర్శనను తిలకించారు. పరేడ్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మించిన పోడియంతో పాటు మీటింగ్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. నీలాద్రి అర్బన్‌పార్క్‌తో పాటు ఎకో టూరింజంగా అభివృద్ధి చేస్తు న్న పులిగుండాల ప్రాజెక్టు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తిలకించి పలు సూచనలు చే శారు. అటవీ సంరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెల్‌ఫోన్‌లను అం దజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, డీఎఫ్‌వో వాడపల్లి మం జుల, రేంజర్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

# లాభాల్లో వాటా ఏదీ..?

» ప్రకటనలో సింగరేణి యాజమాన్యం జాప్యం
» ఎదురుచూస్తున్న కార్మికులు
» ఉద్యమ బాటకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు



రుద్రంపూర్ సింగరేణి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాలను ప్రకటించకపోవడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. లాభాల వాటా కోసం సింగరేణి కార్మికులు ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రతీ ఏడాది దసరా పండుగ వేడుకలకు ముందు సింగరేణి యాజమాన్యం వచ్చిన లాభాలను ప్రకటించి పంపిణీ చేసే సంప్రదాయం కొనసాగుతుంది. ఈ ఏడాది ఇప్పటివరకు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంస్థకు వచ్చిన లాభాలకు ప్రకటించడంలో జాప్యం జరగడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. పండుగ సమీపిస్తుండటంతో లాభాల వాటాపై కార్మికులు ఆశగా ఎదురు చూస్తున్న పరిస్థితులు సింగరేణి వ్యాప్తంగా నెలకొంటున్నాయి. తెలంగాణలోని అతిపెద్ద ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణి తెలంగాణలో పెద్ద పండుగ అయిన దసరాకు లాభాలను ప్రకటించడంతో పాటు కార్మికులకు చెల్లించడం జరుగుతుంది. ఇప్పటికే ప్రధాన కార్మిక సంఘాలు లాభాల వాటా కోసం సింగరేణి వ్యాప్తంగా పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం మాత్రం లాభాలను ప్రకటించడంలో మాత్రం జాప్యం చేయడం వల్ల కార్మికుల్లో, కార్మిక సంఘాల్లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కార్మికులకు వెంటనే లాభాల వాటాను చెల్లించాలని రాజకీయ నాయకులతో పాటు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత జనవరి నుంచి సింగరేణిలో బదిలీలను నిలిపివేసిన యాజమాన్యం పై కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. గత ఏడాది సింగరేణి కార్మికులతో పాటు, కాంట్రాక్ట్ కార్మికులకు సైతం లాభాల నుంచి రూ.5000 చెల్లించారు.

కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు వాటా ధనం కోసం ఆశగా ఎదురు చూస్తూ తమ కుటుంబ అవసరాలకు ఆర్థిక భరోసా ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎదురుచూస్తున్నారు. 2010-2011 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు రూ.351.37 కోట్ల లాభాలు రావడంతో కార్మికులకు 16శాతం బోనస్‌ను చెల్లించారు. ఈ ఏడాది కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**సింగరేణి సంస్థకు ఆయా ఆర్థిక సంవత్సరాల్లో వచ్చిన లాభాలు, కార్మికులకు చెలించిన వాటా శాతం**

| సం. | లాభాలు | కార్మికుల వాటా |
|---|---|---|
| 2010-11 | 351.37 | 16 |
| 2011-12 | 358.27 | 17 |
| 2012-13 | 401,00 | 18 |
| 2013-14 | 418.74 | 20 |
| 2014-15 | 490.44 | 21 |
| 2015-16 | 1066.1 | 23 |
| 2016-17 | 395.38 | 25 |
| 2017-18 | 1212.08 | 27 |
| 2018-19 | 1766.00 | 28 |
| 2019-20 | 993.86 | 28 |
| 2020-21 | 272.64 | 29 |
| 2021-22 | 1227.00 | 30 |
| 2022-23 | 2222.5 | 32 |
| 2023-24 | 2412.00 | 33 |

**ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి**

**త్యాగరాజన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్**



సింగరేణి యాజమాన్యం లాభాల వాటాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు లాభాల వాటాను అందజేయాలి. దసరా వేడుకలకు ముందుగానే 35 శాతం వాటాను అందించాలి. లేనిపక్షంలో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తాము.

**జీఎం కార్యాలయాలను ముట్టడిస్తాం**

**● రాజ్ కుమార్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి**



సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు లాభాల వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19న జీఎం కార్యాలయాలను ముట్టడిస్తాము. ఆగస్టు 14న జరిగిన బోర్డు సమావేశంలో చేసిన తీర్మానాలను యాజమాన్యం ప్రకటించడం లేదు. యాజమాన్య నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతాం. కార్మికుల సంక్షేమం కోసం మరిన్ని పోరాటాలు నిర్వహిస్తాం. లాభాలా వాటాను చెల్లించేంతవరకు పోరాడుతాం.

## 22 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి జరిగే ఓపెన్ స్కూల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ బి. వేణుగోపాల్ తెలిపారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలోని చుంచుపల్లి హైస్కూల్‌లో పదో తరగతి, బాబు క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షలకు పదవ తరగతి 320 మంది, ఇంటర్మీడియట్ విద్యార్థులు 300 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. వివరాల కోసం ఏసీఈ మాధవరావు 89192 79238 నెంబర్‌ను సంప్రదించగలరు. ఈ సమావేశంలో డీఈవో నాగలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, పాల్గొన్నారు.

## నిరంతర కృషితోనే మెరుగైన ఫలితాలు

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరాయంగా కృషి చేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యం అవుతాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం రాపర్తినగర్‌లోని టీజీఎంఆర్‌జేసీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కాలేజీలో లైబ్రరీ, పాఠ్యపుస్తకాలు, తరగతి గదులను తిరుగుతూ సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ ముచ్చటించారు. పిల్లలకు విద్యావసరాలను కల్పించామన్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా సంభాషించి, వారికి ప్రేరణనిచ్చేలా తన జీవిత అనుభవాలను కలెక్టర్ పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కేంద్రంలో విద్యార్థినుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ చాలా క్లిష్టమైన దశ అని, మన భవిష్యత్తు ఇంటర్ పై ఆధారపడి ఉంటుందని, తన జీవితంలో కూడా ఇంటర్ దశలో బాగా రాణించడం వల్ల బిట్స్ పిలానీ లో సీటు వచ్చిందని, తర్వాత సివిల్స్ రాయడం జరిగిందని అన్నారు. ఇంటర్‌లో బాగా చదివితే మంచి కెరియర్ లభిస్తుందని అన్నారు. డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివేందుకు మంచి కళాశాలలో సీటు సంపాదించడం చాలా ముఖ్యమని అన్నారు. పోటీ పరీక్షలో రాణించి మంచి కళాశాలలో సీటు సంపాదిస్తే నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, మంచి వాతావరణం లభిస్తుందని, మన సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో బయటకు తీసుకొనిరావచ్చని అన్నారు. నీట్‌కు 40 మంది, ఐఐటీకి 40 మంది ఉమ్మడి ఖమ్మం విద్యార్థులకు ఉచిత శిక్షణ వసతి ఏర్పాటు చేసి శిక్షణను అందించనున్నట్లు తెలిపారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా నీట్, జేఈఈ పోటీ పరీక్షలు రాసేందుకు నాణ్యమైన శిక్షణ మంచి నైపుణ్యం కల్గిన అధ్యాపకులు అందించడం జరుగుతుందని, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు దీటుగా బోధన ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల స్టడీ మెటీరియల్స్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, మైనారిటీ శాఖ ఆర్ఎల్సీ అరుణకుమారి, ప్రిన్సిపాల్ చుండు అఖిల, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల పాటు పామాయిల్ గెలల కొనుగోళ్ల నిలిపివేత

అశ్వారావుపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అప్పారావుపేట, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలలో రేపటి నుంచి మూడు రోజుల పాటు పామాయిల్ గెలల కొనుగోళ్లను నిలిపివేయడం జరిగిందని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత వారంగా అధిక వర్షాలు కారణంగా ఫ్యాక్టరీలకు అత్యధికంగా గెలలు వస్తున్న నేపథ్యంలో గెలలు ఫ్యాక్టరీలో పేరుకొని పోయి ఉన్నాయన్నారు. పామాయిల్ పండు పాడవ్వకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో 19,20,21వ తేదీలలో పామాయిల్ గెలలు కొనుగోళ్లు జరగవని పేర్కొన్నారు. రైతులు ఈ మూడురోజులు గెలలను నరకవద్దని కోరారు. రైతులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

» మణుగూరు, పినపాక, తిరుమలాయపాలెంలో ఘటనలు

మణుగూరుటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియలోని ఓసీ-2 గనిలో డ్రిల్ ఆపరేటర్‌గా పనిచేసే కమటం కుమారస్వామి(35) గురువారం మొదటి షిఫ్టును ముగించుకుని అశ్వాపురం మండలంలోని సీతారామపురం గ్రామానికి వెళ్తున్న క్రమంలో మణుగూరు ముత్యాలమ్మ నగర్ ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆశ్రమ పాఠశాలలో ఉన్న కుమార్తెను చూసి వెళ్తూ..**



మహేష్(ఫైల్)

పినపాక: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఐలాపురం క్రాస్ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు మండలం, విప్పల సింగారం గ్రామానికి చెందిన పాల్వంచ మహేష్ (32) అనే తాపీ మేస్త్రీ, ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న తన కుమార్తెను చూసేందుకు, తన మేనకోడలుతో వచ్చి చూసి, తిరిగి వెళ్తున్నాడు. ఐలాపురం క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంతో రోడ్డు ఎక్కుతుండగా, ఏటూరునాగారం ప్రధాన రహదారి నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో మహేష్‌తో పాటు మేనకోడలుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పినపాక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మణుగూరు తరలించారు. చికిత్స పొందుతూ మహేష్ మృతి చెందాడు. కాగా బాలికకు చికిత్స అందిస్తున్నారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు పెద్దపల్లి జిల్లాకు చెందిన కారు యజమాని అంజయ్యపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు పరిశీలించారు.

తిరుమలాయపాలెం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కాకరవాయి వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దవాగు తండాకు చెందిన బానోత్ శ్రీను (46) గురువారం రాత్రి కాకరవాయి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## కొమ్ముగూడెం పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ

» సుమారు రూ. 2.50లక్షల ఆభరణాల అపహరణ
» వేలిముద్రలను సేకరించిన క్లూస్ టీం



ఆలయంలో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

జూలూరుపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్థరాత్రి చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.2.50 లక్షల విలువ చేసే అభరణాలు, డబ్బులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బి.లాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం గేటు తాళాలను పగులగొట్టి అమ్మవారికి సంబంధించిన నాలుగు బంగారపు పుస్తెలు, ముక్కుపుడక, వెండి పట్టీలు, మెట్టలను తీసుకెళ్లారు. ఆలయం లోపల ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.12వేలను ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయాన్ని శుభ్రం చేయడానికి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వచ్చే సరికి గేటు, తలుపుల తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో అతడు చోరీ జరిగిందని గుర్తించి సమాచారాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్‌కు అందించారు. దీంతో కమిటీ సభ్యులు అందరు కలసి ఆలయం లోపలకి వెళ్లి చూడగా సుమారు రూ. 2.50లక్షల విలువ చేసే ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. చోరీపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయాన్ని ఎస్ఐ బాదావత్ రవి సందర్శించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలను సేకరించారు. మంగళవారం రాత్రి మండలంలోని మాచినేనిపేటతండా, పడమటనర్సాపురం గ్రామాలలో చోరీలు జరిగాయి. మరుసటి రోజు రాత్రి కొమ్ముగూడెంలోని ఆలయంలో మరో చోరీ చోటుచేసుకుంది. మండలంలో రెండు రోజులుగా వరుస చోరీలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చోరీ సంఘటనపై ఆయల కమిటీ ఛైర్మన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అవినీతికి అడ్డాగా తహసీల్దార్ కార్యాలయం

» లంచం తీసుకుంటూ మూడుసార్లు ఏసీబీకి చిక్కిన తల్లాడ రెవెన్యూ ఉద్యోగులు

తల్లాడ, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తల్లాడ మండల తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. దేశానికి వెన్నుముకైన రైతులను లంచం కోసం వేధింపులకు గురిచేసి అవినీతికి పాల్పడి ముచ్చటగా మూడుసార్లు రెవెన్యూ ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఎటువంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా భూ భారతి కార్యక్రమంలో రైతులకు పారదర్శకంగా రెవెన్యూ సేవలందించాలన్న, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలను తల్లాడ మండల రెవెన్యూ శాఖ అధికారులు పెడచెవిన పెట్టారు.

15కుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు స్లాట్ బుకింగ్ చేసుకుని రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి వచ్చిన రైతు వద్ద రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తల్లాడ మండలంలో కొందరు వీఆర్ఏ, వీఆర్వో, ఆర్ఐల నుంచి తహసీల్దార్ స్థాయి రెవెన్యూ అధికారులు సైతం రైతుల వద్ద నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడడం ఆనవాయితీగా వస్తుంది. కొందరు పైరవీకారులు కూడా దళారులగా మారి రెవెన్యూశాఖలో అవినీతికి మరింత ఊతమిస్తున్నారు. ముక్కుపిండి ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తల్లాడ మండల చరిత్రలో మొట్టమొదటిసారి 1989 మార్చి17న పహణీ కాపీలు ఇచ్చేందుకు మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన రైతు తూము వెంకటనారాయణరెడ్డి వద్ద రూ.400 లంచం తీసుకుంటూ అప్పటి తహసీల్దార్ ఎల్.కేశవరావు ఏసీబీకి పట్టుబడ్డారు. 2018ఆగస్టులో పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చేందుకు మండల పరిధిలోని కలకొడిమ వీఆర్వో ఎం.శ్రీనివాసరావుతో పాటు అతని ప్రైవేటు వ్యక్తిగత సహాయకుడు రమేష్ కలిసి రైతు సుబ్బారావు వద్ద రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. తాజాగా బుధవారం రాత్రి 15కుంటల భూమి రిజిస్ట్రేషన్ కోసం మల్లారం గ్రామానికి చెదిన రైతువద్ద రూ.10వేలు లంచం తీసుకుంటూ తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాలోతు బాస్కర్, భూ భారతి కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్‌లు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వస్థలమైన కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సరిహద్దు మండలమైన తల్లాడలో భూ భారతి రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ పట్టుబడడం సంచలనం కలిగించింది. అవినీతి అడ్డాగా మారిన తల్లాడ తహసీల్దార్ కార్యాలయాన్ని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు చేపట్టి పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా రెవెన్యూశాఖ సేవలందించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## అటవీశాఖ నర్సరీలో మొక్కల ధ్వంసం

దుమ్ముగూడెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి పర్ణశాల నార్త్ సెక్షన్లోని జానకి సెంట్రల్ నర్సరీ మొక్కలపై గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి కలుపు మందు పిచికారీ చేశారు. సుమారు లక్షకు పైగా గంధం, టేకు మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, రూ.4నుంచి రూ5లక్షల వరకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కలుపు మందుకు విరుగుడుగా కొన్ని రకాల మందులను అటవీశాఖ సిబ్బంది గురువారం పిచికారీ చేశారు. రేంజి అధికారి కమల సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని ఎఫ్‌డీవో సుజాత దృష్టికి తీసుకెళ్లారు.

## పదో తరగతి పరీక్ష ఫీజు రూ.3,500!

» ఖమ్మంలోని ఓ పాఠశాల యాజమాన్యం వసూళ్లు
» ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఖమ్మం నగరంలోని ఓ పాఠశాల పరీక్ష ఫీజు తేదీ సమీపిస్తోందని, బోర్డుకు రూ.3,500 చెల్లించాలని చెబుతూ సంబంధిత పాఠశాలల విద్యార్థులను గందరగోళానికి గురిచేసింది. సీబీఎస్ఈ బోర్డుకు ఫీజు చెల్లించాలని చెబుతూ అధికంగా ఫీజు వసూలు చేస్తుండగా కొందరు విద్యార్థుల తల్లితండ్రులు గురువారం పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌తో మాట్లాడగా ప్రిన్సిపాల్ తమ పాఠశాలలో అంతే ఫీజు తీసుకుంటామని దురుసుగా మాట్లాడారని వాపోయారు. వాస్తవ రుసుం సబ్జెక్టుకు రూ.320, ఆరు సబ్జెక్టులకు కలిపి రూ.1920 మాత్రమేనని కానీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం అంటూ రూ.3500 వసూలు చేస్తున్నారని, ఫీజు రిసీప్ట్ ఇవ్వాలని కోరగా ఫీజు రిసీస్ట్ ఇవ్వటం కుదరదని చెప్పటంతో కొందరు తల్లితండ్రులు వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదేం లేక యాజమాన్యం పలువురు తల్లితండ్రులకు రూ.3,500 ఫీజు రశీదులు అందించారని తెలిసింది.

## మా డబ్బులు మాకిప్పించండి

» ఆందోళనకు దిగిన బాధితులు



ఆందోళన చేస్తున్న బాధితులు

మణుగూరుటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని శ్రీనివాస మెటల్ జనరల్ స్టోర్స్ వ్యాపారి, బంధువులు కలసి తమకు ఇవ్వాల్సిన డబ్బులను తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారంటూ 43 మంది బాధితులు జనరల్ స్టోర్స్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. బేతం చర్ల వెంకటేశ్వర్లు బావమరుదులు రామ లక్ష్మణ్‌లు తమ వద్ద మొత్తం రూ.రెండు కోట్ల ఇరవై లక్షలను ఒకరికి తెలియకుండా మరోకరి వద్ద అప్పుల రూపేణ వ్యాపారాభివృద్ధి పేరిట తీసుకున్నారని బాధితులు తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా తీసుకున్న సోమ్ములను తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన పంచాయతీల్లో కోటి పదకొండు లక్షల యాభై వేలను ఇచ్చేందుకు అంగీకరించిన వారు. కేవలం యాభై ఒకటిన్నర లక్షలను మాత్రమే ఇచ్చి మిగతా సొమ్మును ఇవ్వకుండా తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. కాగా వ్యాపారి పోలీసులను ఆశ్రయించగా, బాధితులు అంతా డీఎస్పీ రవీంద్రరెడ్డిని కలసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయితే బాధితులు ఫిర్యాదులు ఇస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపడతామని డీఎస్పీ పేర్కోన్నారు. దీంతో బాధితులు తమ ఆందోళన విరమించారు.

## పాల్వంచ నుంచి తరలిపోనున్న హాట్‌లైన్స్ సబ్ డివిజన్ కార్యాలయం?

» ట్రాన్స్‌మిషన్‌లో సమస్యలు వస్తే వరంగల్ నుంచి పరిష్కరించాల్సిన పరిస్థితి

పాల్వంచ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పారిశ్రామికంగా ఎంతో పేరుగడించినా ప్రస్తుతం దాని ప్రాధాన్యత జిల్లాలో కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దానికి కారణం పాల్వంచలోని ప్రభుత్వ కార్యాలయాలు క్రమంగా ఇక్కడ నుంచి తరలిపోవడమే. ఇప్పటికే ఐటీడీఏ, ఆర్‌డీఓ, జీసీసీ, హౌసింగ్ కార్యాలయాలు తరలిపోగా తాజాగా పాల్వంచ మునిసిపల్ కార్యాలయం కూడా కొత్తగూడెం కార్పోరేషన్ కావడంతో అక్కడికే తరలిపోయింది. దీంతో పాల్వంచ ప్రాధాన్యతపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ క్రమంలోనే పాల్వంచ సీతారాంపట్నంలోని హాట్‌లైన్స్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని వరంగల్‌కు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం . ట్రాన్స్‌మిషన్ విభాగంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యాలయం ద్వారా ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల పరిధిలోని ట్రాన్స్‌మిషన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తుంటారు. 220కేవీ, 400 కేవీ, 132 కేవీ, లైన్స్‌లోనే కాక సబ్ స్టేషన్లలో ఎదరయ్యే కీలక సమస్యలను ఈ విభాగం వారు చూసుకుంటూ ఉంటారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం హైదరాబాద్ మెట్రో, హైదరాబాద్ రూరల్, రామగుండం, సీతారాంపట్నంలో మాత్రమే సబ్ డివిజన్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చేస్తున్నారు. అత్యాధునిక శిక్షణ పొందిన



ఉద్యోగులు ఇందులో ఉండటంతో సమస్యలను వెంటనే గుర్తించడమే కాక అత్యాధునిక పరికరాలను వినియోగించి తక్షణ మరమ్మత్తులు చేపడుతుంటారు. ఇంతటి ప్రధాన భూమిక పోషించే ఈ కార్యాలయం కూడా ఇక్కడ నుంచి తరలిపోతే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్‌లో ఎదురయ్యే సమస్యలను చేధించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంటుంది. కానీ ఈ కార్యాలయాన్ని తరలించడానికి ఇక్కడి అధికారులే పావులు కదుపుతున్నారని సమాచారం. ఈ క్రమంలోనే సీతారాంపట్నం హాట్‌లైన్స్ సబ్ డివిజన్ కార్యాలయం తరలించాలని ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటే వారు ఆ వినతిని పరిగణలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలియవచ్చింది. ఈ విషయంపై వరంగల్ జోన్ సీఈ శ్రీరామ్‌ను వివరణ కోరగా ఈ విషయం అడ్మినిస్ట్రేటివ్ మేటర్ కిందకు వస్తుందని చెప్పి దాటవేయడం కొసమెరుపు.

## సాలెబంజర రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు

కొణిజర్ల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలెబంజర రేషన్ షాపుపై డీఎస్వో చందన్‌కుమార్, డీటీ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో గురువారం తనిఖీ నిర్వహించారు. ఈతనిఖీల్లో భాగంగా సెప్టెంబరు నెలకు సంబంధించి 86.76క్వింటాళ్ళ రేషన్ కేటాయించగా, 1 నుంచి 18వతేదీ వరకు కేవలం 7.31 క్వింటాళ్లు మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు గుర్తించారు. రేషన్ షాపులో మిగిలిన 79.45క్వింటాళ్ళ భౌతికంగా నిలవ ఉండాల్సి ఉండగా, కేవలం క్వింటా మాత్రమే నిలవ ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రేషన్ ప్రజలకు అందించకపోగా నిలవలో కూడా తేడా ఉండడంతో రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. నిలవ ఉన్న క్వింటా రేషన్‌ను సమీప గ్రామరేషన్ డీలర్‌కు అప్పగించారు. జిల్లాలోని అన్ని రేషన్‌షాపులను తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ అధికారులు

# పేదల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

» రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి

» కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



కూసుమంచిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కూసుమంచిలో రూ.35లక్షలతో, చేగొమ్మలో రూ.50లక్షలతో కేశ్వాపురంలో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గత పాలకులు డబుల్ ఇళ్లపేరుతో పేదలను మోసంచేస్తే ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో 4.5 లక్షల ఇళ్లు మంజూరీ చేసినట్లు తెలిపారు. మిగిలిన అర్హులకు కూడా విడతలవారీగా మంజూరీ చేస్తామన్నారు. ప్రతీసోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు బిల్లులు బ్యాంకుల్లో జమ చేస్తామన్నారు.

**జీపీవోలు అక్రమాలకు పాల్పడితే ఇంటికే**

భూభారతి చట్టం పకడ్బందీగా చేపట్టాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామపాలన అధికారులను నియమించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇటీవల జీపీవోలు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో జీపీవోలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఎటువంటి అక్రమాలకు పాల్పడినా ఉద్యోగం ఊడుతుందని హెచ్చరించారు.

**డబుల్‌బెడ్‌రూం వాసులు సమస్యలు పరిష్కరిస్తాం**

డబుల్ ఇళ్ల నివాసితుల సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. నివాసితులు పలువురు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, స్పెషలాఫీసర్ రమేష్, ఎంపీడీవో రామచంద్రరావు, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

**అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు**

తిరుమలాయపాలెం:నిరుపేదలందరికీ సంక్షేమపథకాలు పారదర్శకంగా అమలు చేస్తూ అండగా ఉంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండంలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మేడిదపల్లిలో సీసీరోడ్లు, అంతర్గత నిర్మాణ పనులకు, అంగన్‌వాడీ కేంద్రం పనులకు శంకుస్థాపన చేశారు. తిమ్మక్కపేటలో సీసీరోడ్లు, కుక్కలతండాల బీటీరోడ్డు నిర్మాణ పనులకు, సీసీరోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, నియోజకవర్గ స్పెషల్‌ఆఫీసర్ రమేష్, ఆర్డీవో నరసింహారావు, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీచైర్మన్ బొర్రా రాజశేఖర్, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, ఓర వెంకటేశ్వర్లు, సంద్ర వెంకన్న పాల్గొన్నారు.



ముస్తాబైన జమ్మిబండ

# 22 నుంచి దేవీ నవరాత్రులు

» తొమ్మిది రోజుల పాటు పూజలందుకోనున్న దుర్గాదేవి

» మాలధారణకు సిద్ధమైన దుర్గామాత భక్తులు

» ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీలు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈనెల 22 నుంచి దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాలు, మండపాల వద్ద అమ్మవారి నవరాత్రులు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని జమ్మిబండ వద్ద ఏటా నిర్వహించే దేవినవరాత్రుల వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రులకు ప్రత్యేక మండపంతోపాటు ప్రాంగణానికి రంగులు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు మండప నిర్వాహకులు ముందుగానే అమ్మవారి విగ్రహాలను కొనుగోలు చేశారు.ఈ ఏడాది మొత్తం 11రోజులు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.కొందరు ఈపండుగ మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తర్వాత మూడు రోజులు లక్ష్మీదేవిని, ఆతర్వాత మూడు రోజులు సరస్వతీ మాతకు పూజలు నిర్వహిస్తారు. నవరాత్రుల్లో సామాన్యుల నుంచి యోగుల వరకు అమ్మవారిని పూజిస్తారు. తొమ్మిదిరోజుల్లో అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. లోక కల్యాణం కోసం అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తారు. ప్రకృతి ఆధీనంలో ఉండాలని, అందరూ క్షేమంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటారు. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంకాలం రెండుసార్లు భక్తిశ్రద్ధలతో దేవీ మాతకు పూజలు, అర్చనలు చేస్తుంటారు. యువజన మండళ్లు, మహిళా మండళ్ల వారు అమ్మవారి మండపాల వద్ద రాత్రుళ్లు భజనలు, కోలాటాలు ఆడుతుంటారు. బతుకమ్మ ఆటలను ఆడుతూ అమ్మను కొలుస్తారు. చండీహోమాలు, శ్రీలక్ష్మీగణపతి, దుర్గా రుద్ర హోమాలు నిర్వహిస్తారు. మండపాల వద్ద పారాయణాలు చేస్తూ అమ్మవారిని ఆరాధిస్తారు. దేవీశరన్నవరాత్రుల సందర్భంగా మాలధారణకు జిల్లాలో యువకులు సిద్ధమయ్యారు. తొమ్మిదిరోజుల పాటు నియమనిష్ఠలతో ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుందనే నమ్మకంతో మాలలు ధరిస్తారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాగర్తి**



సేవాకార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు

నేలకొండపల్లి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం నేలకొండపల్లిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. నేలకొండపల్లిలోని శివాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నదని సుధాకర్ అన్నారు. మోదీ ఆధ్వర్యంలో త్వరలోనే భారత్ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక సైనిక సంపత్తి గల దేశంగా తయారవుతుందన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మొహినుద్దీన్, కొండా హర్షవర్ధన్, రమేష్, శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్**




ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నేలకొండపల్లి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ 18వ డివిజన్ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై తక్షణమే దృష్టి సారించి, పరిష్కరించటానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, శీలం ఉమేష్, బోడ వెంకట్, సాయి, ప్రవీణ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): 40ఏళ్లక్రితం కలిసి చదువుకున్న స్నేహితులు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాల నయబజారులో 1983-84లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల్లో ఖమ్మంరూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆయన దశదిన కర్మలకు హాజరై రూ.51,500 కుటుంబ సభ్యులకు అందించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, వెన్నా, దేవేందర్, శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రోత్సాహమున్నా.. సాగు ఏదన్నా?

(5వ పేజీ తరువాయి)

రైతులు ముందుకు రావడం లేదు.

● పుట్టగొడుగుల సాగు కూడా జిల్లాలో స్వల్పంగానే ఉంది. జిల్లాలో 32యూనిట్లు పుట్టగొడుగుల సాగు పెట్టాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. దీనికి సుమారు ఒక్కో యూనిట్‌కు రూ.20లక్షల వరకు ఖర్చవుతుంది. రూ.లక్ష నుంచి రూ.లక్షా30వేలు సబ్సిడీ వస్తుంది. అలాగే జిల్లాలో సుగంధద్రవ్యాలు, అల్లం, పసుపు, వెల్లుల్లి లాంటి పంటలను కూడా ప్రోత్సహించబోతున్నారు. విత్తన సుగంధ ద్రవ్యాల కింద 1,005 ఎకరాల సాగు లక్ష్యంపెట్టుకోగా ఎకరానికి రూ.20వేలు ఖర్చుకుగాను రూ.8వేలు సబ్సిడీ అందిస్తారు. 5ఎకరాల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. అల్లం, పసుపు, వెల్లుల్లి సుమారు 3,294 ఎకరాల్లో పెంచాలని జిల్లా ఉద్యానశాఖ నిర్ణయించింది. ఎకరానికి రూ.40వేలు పెట్టుబడికాగా రూ.16వేల వరకు సబ్సిడీని 5ఎకరాల వరకు పొందే వీలుంది. అలాగే పాత తోటల్లో పునరుజ్జీవనం పథకం కింద కూడా సబ్సిడీ పొందే అవకాశం రైతులకు ఉంది. సేంద్రియ సాగు, వర్మీకంపోస్టు, మల్చింగ్‌సాగు, తేనెటీగల పెంపకం లాంటి పథకాలకు కూడా ఉద్యానశాఖ సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంది.

**ప్రాజెక్టు ఆధారిత రాయితీ**

జిల్లాలో హైటెక్ నర్సరీల యూనిట్లు, విత్తన మౌలిక వసతులు యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, నెట్ హౌస్‌లకు కూడా ఉద్యానశాఖ రాయితీలు కల్పిస్తోంది. రైతుల పొలాల్లో పంటలను గ్రేడ్ చేసేందుకు మార్కెట్‌కు పంపేందుకు నిర్మించే ప్యాక్ హౌస్‌లకు యూనిట్ ధర రూ.4లక్షల అవుతుంది. జిల్లాలో 258 ప్యాక్‌హౌస్‌ఎల పెట్టాలని నిర్ణయించగా ఇందులో రూ.2లక్షల వరకు రాయితీ పొందవచ్చు. పండ్లు, కూరగాయల నిల్వ, గ్రేడింగ్‌కు పొలం వద్దనే ఈప్యాక్‌హౌస్ నిర్మాణం చేయాల్సి ఉంటుంది. అలాగే జిల్లాలో 12కోల్డ్‌స్టోరేజ్‌లు కూడా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధద్రవ్యాలు నిలవ ఉంచేందుకు సబ్సిడీ 35శాతం ప్రాజెక్టు ఖర్చులో ఇవ్వనున్నారు. 5వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీకి సుమారు రూ.4.80కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రూ.1.68కోట్లు సబ్సిడీ అందనుంది. రిఫైనింగ్ చాంబర్, సోలర్‌డ్రై యూనిట్లు కూడా రైతులకు అందించనున్నారు. వీటికి కూడా సబ్సిడీ ఇవ్వనున్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోండి**

**ఎంవీ మధుసూదన్,జిల్లా ఉద్యానశాఖ అధికారి**

పండ్లు, పూల, కూరగాయల పంటలకు ప్రోత్సాహానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో కూరగాయలు, పండ్లు, పూలతోటల అభివృద్ధికి ప్రోత్సహకాలు ఇవ్వబోతున్నాం. రైతులు మండల ఉద్యాన అధికారులను కలిసి సాగుకు అవకాశం ఉన్నచోట పంటలు వేసి ప్రభుత్వ రాయితీలు పొందొచ్చు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయలు, పూలు, పండ్లకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులకు శిక్షణలు ఇచ్చి కూడా సాగును ప్రోత్సహిస్తున్నాం.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు



ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఈనెల25 నుంచి నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు సోను, వివేక్, జగన్, శాన్విరెడ్డి, సిరిచందన, శ్రీజ, నవితరెడ్డి ఎంపికైనారని పాఠశాల యజమాన్యం తెలిపింది. ఈనెల 17న నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీజీఎం చేతన్‌మాధుర్, కో-ఆర్డినేటర్ క్రిష్టారావు, ప్రిన్సిపాల్ టిఎల్ఎన్. శర్మ, అర్జున్, రామక్రిష్టారెడ్డి ఉన్నారు.

**కూసుమంచి విద్యార్థులు...**

కూసుమంచి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కూసుమంచి బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయిలో పోటీలు జరుగగా 9, 10 తరగతుల విద్యార్థులు నాగరాజు, విఘ్నేష్ ప్రతిభ కనబరిచారు. త్వరలో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఆర్‌సీవో రాంబాబు, పీఈటీ నరసింహ అభినందించారు.

## రేపు జాబ్ మేళా

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఎంఎస్ఎన్ లేబరోటరీస్‌లో ప్రొడక్షన్ ట్రెయినీ ఉద్యోగాలు కల్పించేందుకు శనివారం ఉదయం ప్రభుత్వ ఐటీఐ కళాశాలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# ప్రజా ఉద్యమ నాయకుడు జియావుద్దీన్

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం**



జియావుద్దీన్ సంస్మరణసభలో మాట్లాడుతున్న తమ్మినేని

తిరుమలాయపాలెం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సమస్యలు,ఉపాధ్యాయుల సమ్యల పరిష్కారానికి ఎస్‌డీ జియావుద్దీన్ పోరాటం చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం కొనియాడారు. గురువారం మండలంలోని జియావుద్దీన్ సంస్మరణసభలో మాట్లాడారు. జియావుద్దీన్ తన జీవితకాలం గిరిపుత్రుల కోసం సేవ చేశారని, పదవీ విరమణ అనంతరం సీపీఎంలో పనిచేసి ప్రజాఉద్యమాలుచేశారన్నారు. ఆయనజీవితం నేటి యువతకు ఆదర్శకంగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, వీరన్న, ముత్తయ్య, ఎన్జీనాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

**మంత్రి పొంగులేటి నివాళులు**

జియావుద్దీన్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు.సుబ్లేడులో జరిగిన దశదిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, సామాజిక ఉద్యమనేత జియావుద్దీన్ పాత్ర మరువలేనిదన్నారు.

**విద్యతోనే సమాజ శ్రేయస్సు**

ఖమ్మంరూరల్:విద్యతోనే సమాజం శ్రేయస్సు చెందుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన మల్లిడి రుక్కమ్మ ఈనెల 9న మరణించారు. గురువారం ఆమె చిత్రపటానికి నివాళుర్పించారు. అనంతరం మల్లిడి అప్పయ్య-రుక్కమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రమేష్ బాబు రూ.లక్ష విలువచేసే 40బల్లాలను సీతారంపు, కొండాపురం ప్రాథమిక పాఠశాలలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతు రుక్కమ్మ జీవితం ఆదర్శప్రాయమని ఎంతోమంది కమ్యూనిస్టు కార్యకర్తకు అన్నం వండి పెట్టిన మహతల్లి అన్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతు సీతారాంపురం గ్రామపాఠశాలను దత్తత తీసుకుంటానని భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన టీవీ ఇతర మౌలిక సదుపాయాలు ఒక్కొక్కటిగా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటి సభ్యులు బండి రమేష్, కార్పోరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, నాయకులు వీరభద్రయ్య,రంగారావు, దండ్యాల వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీనివాసరావు, నవీన్ పాల్గొన్నారు.

## డీపీవో శ్రమదానం

నేలకొండపల్లి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని డీపీఓ ఆశాలత ఆదేశించారు. గురువారం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో డీపీఓ పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ కోరారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తల్లిదండ్రులను చైతన్యం చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ శివ, ప్రధానోపాధ్యాయుడు రమేష్, కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఏడీసీపీ అడ్మిన్‌గా రామానుజం



ఖమ్మంక్రైం,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):ఖమ్మం అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా బి.రామానుజంను నియమిస్తూ పోలీసుశాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఖమ్మంలో పలు విభాగాల్లో ఎస్సై స్థాయి నుంచి ఏసీపీ స్థాయి వరకు విధులు నిర్వహించిన ఆయన ప్రస్తుతం అడిషనల్ ఎస్పీగా వెయిటింగ్‌లో ఉన్నారు. ఈనేపథ్యంలో ఆయన్ను కమిషనరేట్‌కు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ విభాగానికి నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పాత్రికేయులపై కేసులు సరైంది కాదు

ఖమ్మంసంక్షేమవిభాగం,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులపై కేసులు నమోదు చేయటం సరైంది కాదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, బీఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు ఆరోపించారు. టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.

## లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఓయూ విద్యార్థుల, లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు జిల్లా నుంచి భారీగా తరలి రావాలని బంజరా అడ్వకేట్ జేఏసీ నాయకుడు హరినాయక్ కోరారు. గురువారం ఖమ్మంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్టీల మధ్య కొంతమంది చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు. అందుకేప్రతి తండాలో, ప్రతిగ్రామంలో బంజరాలను మేలుకొల్పేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## పూరిళ్లు లేని ఇందిరమ్మ రాజ్యం

**మేయర్ పునుకొల్లు నీరజ**

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా పేదల సంక్షేమం, అభివృద్ధి కోసమే పని చేస్తుందని, ఖమ్మం నియోజకవర్గంలో పూర్లి లేని ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం 26వ డివిజన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఎక్కడో ఊరి బయట కాకుండా లబ్దిదారుల నివాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జరుగుతున్నాయని గుర్తు చేశారు. నగర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. వార్డు ఆఫీసర్ రాజు కాంగ్రెస్ నాయకులు బుజ్జి, రామయ్య, యాకూబ్, ప్రసాద్, మాధవి పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్

## బస్టాండ్‌లో కదలని వీల్‌చైర్లు



మూలనపడేసిన వీల్‌చైర్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్‌లో వృద్ధులను, దివ్యాంగులను బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంల వరకు తీసుకెళ్లేందుకు తీసుకొచ్చిన వీల్‌చైర్లను మూలన పడేశారు. హైటెక్ హంగులతో నిర్మించిన బస్టాండ్‌లో సకల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అధికారులు ఉన్న పరికరాలనే మూలన పడేస్తుండటంతో పలువురు వృద్ధ, దివ్యాంగ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరం నుంచి దూర ప్రాంతాకు, ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మం నగరానికి వచ్చే పలువురు వృద్ధులు, దివ్యాంగుల కొరకు బస్టాండ్‌లో వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాల్సిన అధికారులు ఉన్న చైర్స్‌ను ఇలా పనికిరాకుండా చేయటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## వీవోఏల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంరూరల్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి పని చేస్తున్న వీఓఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విఓఏల సంఘం రాష్ట్రజేఏసీ కార్యదర్శి శరత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్లో గురువారం జరిగిన జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వీఓఏల జేఏసీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంపాల రమేష్, ఉపాధ్యక్షుడిగా కాటురి మణి,ప్రధాన కార్యదర్శిగా సుశీలను ఎన్నుకున్నారు.





## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బోనకల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బోనకల్‌లో గురువారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయగా అదే బాటలో నేటి ప్రభుత్వం కూడా నడుస్తుందని ఆరోపించారు. బోనకల్ ప్రభుత్వ కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగుల్‌మీరా, వంశీ పాల్గొన్నారు.

## పలువురికి మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



చిన్న మహేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సండ్ర

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం సత్తుపల్లిలో పలువురిని పరామర్శించారు. ఈ సందర్భంగా నాయుడు వెంకటేశ్వరరావు, ధరావత్ చిన్న మహేష్, గాదె వసంతమ్మ, నల్లగట్ల భాస్కరరావులు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న జలగం నగర్‌కు చెందిన యాగంటి హనుమంతరావును పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కూసంపూడి రామారావు, దొడ్డా శంకరరావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, షేక్ రఫీ, మల్లూరు అంకంరాజు, నరుకుళ్ల శ్రీను, గుండ్ర రఘు, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, మిద్దే శ్రీను, మరికంటి శ్రీను, క్లబ్ వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ కృష్ణ, విజయ్, తడికమళ్ల ప్రకాశరావు, నడ్డి ఆనందరావు, అమరవరపు కృష్ణారావు, నండ్రు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యదశలోనే సరైన ఆహారం, విద్య అందించాలి

▸ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
▸ పోషణమాసం కార్యక్రమం ప్రారంభం



సత్తుపల్లిలో అంగన్‌వాడీ ఆయాలకు నూతన వస్త్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్యదశలోనే బిడ్డకు సరైన ఆహారం, విద్య, అభివృద్ధి అవకాశాలను కల్పిస్తే వారికి మంచి భవిష్యత్‌ను అందించవచ్చునని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పోషణ మాసం కార్యక్రమాన్ని స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ప్రారంభించి టీచర్లు, ఆయాలకు నూతన వస్త్రాలను ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 3వ రోజు గురువారం నిర్వహిస్తున్న 'పోషణ బీ పడాయి బీ' కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు అంతా బాధ్యతాయుతంగా పనిచేస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారులకు సరైన పోషణ, విద్యాబోధన చేస్తే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తమకు అందుబాటులో తక్కువ ఖర్చుతో తయారు చేసిన వాటిద్వారా విద్యాబోధన చేసినట్లయితే పిల్లలు త్వరగా నేర్చుకోగలుగుతారన్నారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై దృష్టి సారించాలని, లోపాలు ఉన్న పిల్లలను సమస్యను తమ దృష్టికి తీసుకుని వస్తే ఆరోగ్య పరంగా సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎమ్మెల్యే ముందు పలు సమస్యలు ఉంచగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్కతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సీడీపీవో మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్లు మహాలక్ష్మీ, గంగాజలం, కమల, భవానీ, వసంత, రజిని, రమాదేవి, సుజాత, ప్రసాద్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 20న తెలంగాణ రాష్ట్ర మున్సిపాల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియాన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా మూడవ మహాసభ సందర్భంగా వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని కోరుతూ కల్లూరులో మునిసిపాలిటీ మేనేజర్ నందిశెటి నాగేశ్వరరావుకు గురువారం కార్మికులు వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. ఈ మహాసభకు కార్మికులంత తరలి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు, కార్మిక సంఘ నాయకులు ఎస్‌డి వజీర్‌మీయా, కృష్ణమూర్తి, సుధాకర్, చార్లేస్ పాల్గొన్నారు.

## సత్తుపల్లి ఆర్టీసీ డీఎంగా సునీత



సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపో నూతన డీఎంగా ఊటుకూరి సునీత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నల్లగొండ డిపోలో ఎంఎఫ్‌గా పనిచేస్తూ సత్తుపల్లికి పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. డిపో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కాగా 2022నుంచి సత్తుపల్లి డీఎంగా పనిచేసిన యూ.రాజ్యలక్ష్మీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు



వరి క్షేత్ర సందర్శనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

తల్లాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ శిరీష సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం యూనివర్శిటీ ద్వారా పంపిణీ చేసిన డబ్లుజీఎల్ 44, సిద్ధి వరి క్షేత్రాన్ని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లడుతూ.. రైతులు అధిక దిగుబడుల కోసం మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధ్యం అవుతాయన్నారు. ఏవో ఎండీ తాజుద్దీన్,ఏఈవో త్రివేణి, రైతులు వెంకటేశ్వర్లు, షేక్ షైనుద్దీన్ పాల్గొన్నారు.

## మహాత్ముని మార్గంలో చిన్నారులు



పంచాయతీ కార్యదర్శికి గులాబీ పూలు ఇస్తున్న విద్యార్థులు

తల్లాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సమస్యల పరిష్కారం కోసం చిన్నారులు మహాత్ముని మార్గాన్ని ఆచరించారు. తల్లాడ మండలం మల్లారం ప్రాథమిక పాఠశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పాఠశాల విద్యార్థులు గాంధీగిరి చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి షేక్ సిద్ధిక్‌మియాకు గులాబీపూలు సమర్పించి సమ్యలు పరిష్కరించాలని కోరారు. మల్లారం ప్రాథమిక పాఠశాలలో మిషన్‌భగీరథ పైపులైన్ కనెక్షన్ లేకపోవడంతో తాగునీటికోసం ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాఠశాలలో 3తరగతి నుంచి 5వతరగతి వరకు చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలనుంచి గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించారు. దీంతోకార్యదర్శి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామి ఇచ్చారు.

## పౌష్టికాహారం, ఆరోగ్య, విద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ

పెనుబల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ..పడాయ్ బీ మూడురోజుల శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. టేకులపల్లి మోడల్ స్కూల్లో మూడురోజులపాటు పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య అనే అంశాలపై తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల పరిధిలోని 102మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లూరు సీడీపీవో నిర్మల జ్యోతి, ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మీ, మల్లేశ్వరి, అనురాధ, సుజాత, భవాని, టెక్నికల్ అసిస్టెంట్ పృథ్వీ, పాఠశాల ప్రిన్సిపల్ రూపస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రిన్సిపల్ రూపస్‌ను సన్మానించారు.

### డిజిటల్ విధానంలో శిక్షణ..

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గత మూడు రోజులపాటుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల పోషణ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముంగిసింది. ఈ సందర్భంగా కల్లూరు సీడీపీవో నిర్మలజ్యోతి ప్రసంగిస్తూ స్త్రీ శిశు సంక్షేమం, అభివృద్ధి కోసం రూపొందించిన నూతన విధానంపై టీచర్ల అందరికి సులువుగా అర్థమయ్యేలా డిజిటల్ విధానంతో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పోషక విలువల కలిగిన ఆహారం, అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులకు బోధించే విద్యా విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రత్తమ్మ, నవ్య, సూపర్వైజర్లు సంధ్యారాణి, సుజాత, భవాని, వెంకటమ్మ, సత్యవతి, రత్నకుమారి, రోజా అనురాధ, మల్లేశ్వరీ, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

## చేతి పంపులు ప్రారంభం

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని చండ్రుపట్ల, పేరువంచ గ్రామాల్లో గురువారం దాతల సహకారంతో ప్రజల దాహార్తికై రూ.1.60 లక్షల అంచనాతో ఏర్పాటు చేసిన ఉచిత చేతిపంపులను వెల్ఫేర్ లైఫ్, సీడీఏ సంస్థల అధినేతలు మైఖేల్ వైజర్, పి.ఎనోష్‌కుమార్‌లు గురువారం ప్రారంభించారు. మండలంలోని చండ్రుపట్ల గ్రామంలోని డబల్ బెడ్ రూం కాలనీ, పేరువంచలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న ప్రజానీకం మంచినీటి ఎద్దడితో కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కల్లూరులోని సీడీఏ సంస్థ అధినేత ఎనోష్‌కుమార్ దృష్టికి తీసుకోరాగా ఎట్టకేలకు ఆయన స్పందించారు. సత్వరమే ఆయా గ్రామంలోని కాలనీల్లో చేతిపంపుల ఏర్పాటుకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు ముందుకు వచ్చి చేతి పంపులను ఏర్పాటు చేయించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఆర్థికంగా చేయూత నిచ్చి చేతిపంపులను ఏర్పాటు చేయించిన దాతలకు స్థానిక కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రముఖులు వెంకటేశ్వరరావు, మాగంటి ప్రభాకర్‌రావు, వల్లపునేని రవి, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.



## కేజీబీవీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ఏన్కూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యాలయాల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.నాగేశ్వరరావు కోరారు. గురువారం ఏన్కూరు కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించారు. అనంతరం వర్కర్లనుద్దేశించి మాట్లాడారు. నాయకుడు కొండె వెంకటేశ్వర్లు, కేజీబీవీ నాన్‌టీచింగ్ సిబ్బది నాగమణి, చిట్టెమ్మ, తిరుపతమ్మ, జ్యోతి పాల్గొన్నారు.



చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

### కేజీబీవీ వర్కర్లకు రూ.26వేలు ఇవ్వాలి

పెనుబల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెనుబల్లి మండలంలో కేజీబీవీ, యూఆర్ఎస్‌ల వద్ద వర్కర్లు నిరసన తెలిపారు. గురువారం ఆ సంఘం జిల్లా కోశాధికారి ఏ.శరత్ మాట్లాడుతూ.. కేజీబీవీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, పనిభారం తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈనెల 22న హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా నాయకురాళ్లు జ్యోతి, కరుణ, కోటిలింగం, పద్మ, కరుణ కుమారి, కృష్ణవేణి, కుమారి పాల్గొన్నారు.

## 26న నిరాహారదీక్షను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఈనెల 26న చేపట్టిన నిరాహారదీక్షను జయప్రదం చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను గురువారం సత్తుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, నారాయణవరపు శ్రీనివాస్, వినుకొండ కృష్ణ, మరీదు ప్రసాద్, పద్మజ్యోతి, వెంకటేశ్వరరావు, కాంతారావు పాల్గొన్నారు.

## వైరాలో మంత్రి సీతక్కకు ఘనస్వాగతం



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న శీలం

వైరా, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)కు ఖమ్మంజిల్లా వైరాలో కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. గురువారం సత్తుపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న సీతక్క మార్గమధ్యలోని వైరాలో కాంగ్రెస్ నాయకుడు చెరుకూరి కిరణ్ ఇంట్లో నిర్వహించిన తేనేటి విందుకు హాజరయ్యారు. కిరణ్ ఇంటి వద్ద స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, సామాన్య మహిళలు సీతక్కకు స్వాగతం పలికారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సీతక్కను శాలువాలతో సన్మానించారు. కిరణ్ ఇంటి పరిసరాల్లోని మహిళలు సీతక్కను శాలువాతో సన్మానించి ఆడపడుచుగా చీరెను బహుమతిగా అందజేశారు. అక్కడి ప్రజల యోగక్షేమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్య ఉన్న దూలమ్మతల్లి ఆలయ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీతక్కకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి ఒక వినతిపత్రం సమర్పించారు. దానికి సీతక్క సానుకూలంగా స్పందించారు. నాయకులు చెరుకూరి కిరణ్, సూర్యదేవర శ్రీధర్, బొళ్ల గంగారావు, మరికంటి శివ, జవ్వాజి నాగరాజు, కర్నాటి హన్మంతరావు, తేళ్లూరి వీరయ్య, రాచకొండ సాయి, పైడిపల్లి రవి పాల్గొన్నారు.

## ప్రోత్సాహమున్నా.. సాగు ఏదన్నా?

(5వ పేజీ తరువాయి)

రైతులు ముందుకు రావడం లేదు.

● పుట్టగొడుగుల సాగు కూడా జిల్లాలో స్వల్పంగానే ఉంది. జిల్లాలో 32యూనిట్లు పుట్టగొడుగుల సాగు పెట్టాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. దీనికి సుమారు ఒక్కో యూనిట్‌కు రూ.20లక్షల వరకు ఖర్చవుతుంది. రూ.లక్ష నుంచి రూ.లక్షా30వేలు సబ్సిడీ వస్తుంది. అలాగే జిల్లాలో సుగంధద్రవ్యాలు, అల్లం, పసుపు, వెల్లుల్లి లాంటి పంటలను కూడా ప్రోత్సహించబోతున్నారు. విత్తన సుగంధ ద్రవ్యాల కింద 1,005 ఎకరాల సాగు లక్ష్యంపెట్టుకోగా ఎకరానికి రూ.20వేలు ఖర్చుకుగాను రూ.8వేలు సబ్సిడీ అందిస్తారు. 5ఎకరాల వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. అల్లం, పసుపు, వెల్లుల్లి సుమారు 3,294 ఎకరాల్లో పెంచాలని జిల్లా ఉద్యానశాఖ నిర్ణయించింది. ఎకరానికి రూ.40వేలు పెట్టుబడికాగా రూ.16వేల వరకు సబ్సిడీని 5 ఎకరాల వరకు పొందే వీలుంది. అలాగే పాత తోటల్లో పునరుజ్జీవనం పథకం కింద కూడా సబ్సిడీ పొందే అవకాశం రైతులకు ఉంది. సేంద్రియ సాగు, వర్మీకంపోస్టు, మల్చింగ్‌సాగు, తేనెటీగల పెంపకం లాంటి పథకాలకు కూడా ఉద్యానశాఖ సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంది.

### ప్రాజెక్టు ఆధారిత రాయితీ

జిల్లాలో హైటెక్ నర్సరీల యూనిట్లు, విత్తన మౌలిక వసతులు యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, నెట్ హౌస్‌లకు కూడా ఉద్యానశాఖ రాయితీలు కల్పిస్తోంది. రైతుల పొలాల్లో పంటలను గ్రేడ్ చేసేందుకు మార్కెట్‌కు పంపేందుకు నిర్మించే ప్యాక్ హౌస్‌లకు యూనిట్ ధర రూ.4లక్షల అవుతుంది. జిల్లాలో 258 ప్యాక్‌హౌస్‌ల పెట్టాలని నిర్ణయించగా ఇందులో రూ.2లక్షల వరకు రాయితీ పొందవచ్చు. పండ్లు, కూరగాయల నిల్వ, గ్రేడింగ్‌కు పొలం వద్దనే ఈప్యాక్‌హౌస్ నిర్మాణం చేయాల్సి ఉంటుంది. అలాగే జిల్లాలో 12కోల్డ్‌స్టోరేజ్‌లు కూడా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధద్రవ్యాలు నిలవ ఉంచేందుకు సబ్సిడీ 35శాతం ప్రాజెక్టు ఖర్చులో ఇవ్వనున్నారు. 5వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీకి సుమారు రూ.4.80కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రూ.1.68కోట్లు సబ్సిడీ అందనుంది. రైపెనింగ్ చాంబర్, సోలర్‌డ్రై యూనిట్లు కూడా రైతులకు అందించనున్నారు. వీటికి కూడా సబ్సిడీ ఇవ్వనున్నారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఎంవీ మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి**

జిల్లాలో పండ్లు, పూల, కూరగాయల పంటలకు ప్రోత్సాహానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో కూరగాయలు, పండ్లు, పూలతోటల అభివృద్ధికి ప్రోత్సహకాలు ఇవ్వబోతున్నాం. రైతులు మండల ఉద్యాన అధికారులను కలిసి సాగుకు అవకాశం ఉన్నచోట పంటలు వేసి ప్రభుత్వ రాయితీలు పొందొచ్చు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయలు, పూలు, పండ్లకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన శిక్షణలు ఇచ్చి కూడా సాగును ప్రోత్సహిస్తున్నాం.

## శ్యామ్‌లాల్ కుటుంబాన్ని పరామర్శించిన తమ్మినేని

ఏన్కూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమాంనగర్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు బాలాజీ తనయుడు శ్యాంలాల్ గురువారం మృతి చెందారు. దీంతో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. అందరితో కలుపుగోలుగా ఉండే శ్యాంలాల్ అంత్యక్రియలకు గురువారం పెద్దసంఖ్యలో నాయకులు, అభిమానులు హాజరయ్యారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు హాజరై నివాళులర్పించారు. తండ్రి బాలాజీని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ బాధ్యులు భూక్యా వీరభద్రం, రైతుసంగం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బానోతు మంజుల మాజీ జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, దొంతబోయిన నాగేశ్వరరావు, గుడ్ల వెంకటేశ్వర్లు, ఏర్పుల రాములు మేడా ధర్మారావు నివాళులర్పించారు.



## వేంసూరులో వరుస దొంగతనాలు

వేంసూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొన్ని రోజులుగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండల కేంద్రమైన వేంసూరులోనే ఎక్కువగా దొంగతనాలు చోటుచేసుకున్నాయి. వ్యవసాయ మోటార్ల కేబుళ్లు, ట్రాక్టర్ల బ్యాటరీలు, పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని వైర్లను చోరీ చేస్తున్నారు. బుధవారం రాత్రి ధనిశెట్టి వెంకటేశ్వరరావు ఇంట్లో దొంగలు పట్టీలు అపహరించుకుపోయారు. ఇలా మండలంలో దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసుశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆ ఇళ్లను పరిశీలించిన దాఖలాలు లేవని బాధితులు ఆరోపిస్తున్నారు. దొంగతనాలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండడంపై మండలంలో చర్చనీయాంశమైంది. ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో దొంగతనాలు మరింతగా పెరుగుతాయని ప్రజలు వాపోతున్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. నివారణకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## చేపల చెరువు వేలంపాటలో అవకతవకలు..

▸ నిధులు దుర్వినియోగమయ్యాయని రైతుల ఆరోపణలు

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని బత్తులపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో గల చేపల చెరువుల వేలంపాటల్లో నిధులు మాయమైనట్టు ఆయా చెరువుల పరిధిలో గల ఆయుకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం బత్తులపల్లి గ్రామ పంచాయితీలో ఈ ఏడాది చేపల చెరువుల వేలం పాటపై గ్రామ సభలో ఇటు ఆయుకట్టు రైతులు, చేపల పెంపకం దారుడి మధ్య తీవ్రమైన స్థాయిలో వివాదం జరిగింది. బత్తులపల్లి గ్రామానికి చెందిన ఆయా చెరువుల పరిధలో గల రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తులపల్లి గ్రామ పంచాయితీలో పంచాయితీ కార్యదర్శి రాజేశ్వరీ సమక్షంలో చేపల పెంపకం దారుడు, ఆయుకట్టు రైతులు సమావేశమయ్యారు. ఈ ఏడాది బత్తులపల్లిలోని ఊర చెరువు, లేళ్లి చెరువులకు గాను చేపల పెంపకాల వేలపాట నిర్వహించేలా గ్రామ సభో రైతులు ప్రస్తవించారు. గత మూడు సంత్సరాలుగా ఆయా చెరువుల సంబంధించి గత పంచాయితీ పాలకులు, చేపలపెంపకం దారుడు కుమ్మక్కై వేలంపాట లేకుండానే నిధులు మయాం చేశారని రైతులు ఆరోపించారు. ఇలా సగటున మూడు సంత్సరాలకు గాను వేలంపాట ద్వారా గ్రామ పంచాయితీకి రూ.5 లక్షల నిధులు ఆయకట్టు రైతులకు అందాల్సి ఉంది. గడచిన అనేక సంత్సరాలుగా ఆయా చెరువులకు వేలంపాట ద్వారా వచ్చిన నిధులతో పంట కాల్వల మరమ్మతులు, చెరువుల కట్టలపై చెట్లు తొలిగింపు. చెరువుల లోపల పెరిగిన పిచ్చిమొక్కలు తొలిగించడం వంటి పనులను సమిష్టిగా చేసుకునే వారమని రైతులు చెప్తున్నారు. అందుకు భిన్నంగా రైతుల అమోదం లేకుండా ఎలాంటి తీర్మానాలు లేకుండా ఏకపక్షంగా గత ప్రజా ప్రతినిధి ఒకరు తమ ఇష్టారాజ్యంగా వ్యవహారించి వేలంపాట నగదు రూ.5 లక్షలు కల్లూరుకు చెందిన చేపల సోసైటీ సభ్యుడి నుంచి వసూలు చేసి మాయం చేసినట్లు పలువురు రైతులు చెప్తున్నారు. ఆ వేలంపాట నగదులో కొంత మొత్తం గ్రామ పంచాయితీ ఖాతాలో కూడా జమాకాలేదని రైతులు వివరించారు. ఈ చెరువుల పరిధిలో మాత్రం సగటున 50 నుంచి 100 ఎకరాలలోపుగా ఆయుకట్టు విస్తరించి ఉంది. నిబంధనల ప్రకారం 150 ఎకరాల వరకు ఆయుకట్టు విస్తరించి ఉన్న చెరువులు మాత్రమే మత్స్యసహకార శాఖ వారి పరిధిలో ఉంటాయి. 100 ఎకరాల లోపు ఆయుకట్టు గల చెరువుల రైతుల పరిధిలో ఉంటాయి. ఇలాంటి చిన్నపాటి చెరువులు చేపల పెంపకం, వేలంపాట అనేది ఆయుకట్టు రైతుల ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది. ఆయా చెరువులను రైతుల తీర్మానం కూడా లేకుండా మత్స్యసహార శాఖ వారు చేపల పెంపంకం కోసం వేరే గ్రామానికి చెందిన సభ్యుడకి ఎలా అనుమతించారని గ్రామ సభలో రైతులు ఆరోపించారు. మూడు సంత్సరాల క్రితం నుంచి వేలంపాట లేకుండా గ్రామ పంచాయితీ వారికి అందజేసిన నిధులు ఏమయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణ లేక పోవడం, మరో వైపున గత పంచాయితీ కార్యదర్శి తప్పిదం వల్లే ఈ చెరువుల్లో చేపల పెంపకం నిధులు మాయమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిధుల మాయంలో గతంలో ఉన్న ప్రజాప్రతినిధి కూడా కీల పాత్ర వహించారిని ఆయా చెరువుల ఆయుకట్టు రైతులు లక్కిరెడ్డి పిచ్చిరెడ్డి, వసంతరెడ్డి, అప్పలూరి సత్యనారాయణరెడ్డి, కొర్రా లక్ష్మ, తల్లపు రెడ్డి వెంకటరెడ్డి, పొదిలి వెంకటేశ్వర్లులు ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వేలంపాట నిధులు మాయమైన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని ఆయుకట్టు రైతులు కోరుతున్నారు.



### ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

**ఎంపీడీవో చంద్రశేఖర్**

బత్తులపల్లి గ్రామంలో సదరు చెరువుల చెపల పెంపకంలో వేలంపాట ద్వారా వచ్చిన నిధులు మాయమైనట్లుగా రైతులు నుంచి తమకు ఏలాంటి ఫిర్యాదు అందేలేదని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. తమకు రైతుల నుంచి ఫిర్యాదు వస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.